E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 22-09-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ఎన్‌హెచ్ ప్రాజెక్టుల సమస్యలు తొలగేనా! » 3లో

హెచ్1బీ వీసా రుసుము పెంపుతో ప్రాజెక్ట్ వ్యయాలు పెరగొచ్చు: జీటీఆర్ఐ » 4లో




ఈ సినిమాకి ఆ ఇద్దరే స్టార్స్: పవన్ కల్యాణ్ » 5లో



'తమన్నా' గ్లామరస్ సాంగ్ కోసం కోట్లలో ఖర్చు » 5లో



పైక్రాఫ్ట్ ఉపాధ్యాయుడేం కాదు: అశ్విన్ » 6లో



# పాక్‌ను మరోసారి చిత్తు చేసిన భారత్



పాకిస్థాన్ కాస్త పోటీ ఇచ్చినా ఫలితం పాతదే. చిరకాల ప్రత్యర్థిపై మళ్లీ టీమ్ఇండియాదే పైచేయి. బంతితో అనుకున్నంతగా రాణించలేకపోయినా, ఫీల్డింగ్‌లో విఫలమైనా.. బ్యాటుతో మెరిసిన భారత్, ఈ ఆసియాకప్‌లో పాకిస్థాన్‌ను రెండోసారి మట్టికరిపించింది. సూపర్ 4లో బోణీ కొట్టింది. అభిషేక్ శర్మ భారత్ హీరో. పిడుగుల్లాంటి షాట్లతో పాక్‌ను బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన ఈ యువ ఓపెనర్.. లక్ష్యాన్ని తేలిక చేశాడు. విజయం సమీపంలో కాస్త తడబడ్డా.. అదిరే ఆరంభం ఫలితంగా భారత్ గెలుపు తీరానికి చేరింది.

- » పాకిస్తాన్‌పై భారత్ మరో ఘన విజయం
- » 6 వికెట్లతో గెలిచిన టీమిండియా
- » చెలరేగిన అభిషేక్, గిల్
- » బుధవారం బంగ్లాదేశ్‌తో భారత్ పోరు

తరువాయి 6లో



# నేటి నుంచి 'జీఎస్‌టీ' తగ్గింపు ఉత్సవం

తరువాయి 6లో




- » మధ్యతరగతి ప్రజలకు కాస్త ఆదా
- » 5%.. 18%..40%... ఇకపై ఈ మూడే శ్లాబ్‌లు
- » కిరాణా సరుకులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5 శాతంలోకి
- » ఔషధాలు, వైద్య సంబంధ పరికరాలపైనా పన్ను తగ్గింపు.. బీమా పాలసీ ప్రీమియంలపై పూర్తిగా పన్ను మినహాయింపు
- » కుటుంబాన్ని బట్టి నెలకు రూ.1700–2200 మిగిలే చాన్స్
- » 40 శాతంలోకి సిగరెట్లు, పాన్‌మసాలా, గుట్కా
- » సిమెంటు సహా నిర్మాణ సామగ్రిపై తగ్గింపు
- » రోడ్లపైకి మరిన్ని చిన్నకార్లు
- » 1500 సీసీ దాటిన ఎస్‌యూవీలు,హైఎండ్ కార్లపై 40% పన్ను
- » అంతిమ ప్రయోజనాలు ప్రజలకు చేరేలా ప్రభుత్వం పర్యవేక్షణ

ఈకబురు,: వివిధ వస్తువులపై సవరించిన కొత్త పన్ను రేట్లు సోమవారం నుంచి అమల్లోకి రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తూ ... జీఎస్‌టీ 2.0గా పేర్కొంటున్న ఈ సవరణలతో చాలా వస్తువుల ధరలు మారబోతున్నాయి. మధ్యతరగతి భారతావనికి ఈ పన్నుల మార్పు ఎంతో మేలు చేస్తుందని, చాలా వస్తువుల ధరలు తగ్గుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ సైతం ఇదే చెప్పారు. ఈ నేపథ్యంలో అసలు జీఎస్‌టీ మండలి చేసిన సవరణల వల్ల ఎవరికి లాభం? ధరల్లో హెచ్చుతగ్గులు ఏ రకమైన ప్రభావం చూపబోతున్నాయి?

# ఆక్రమణలకు హైడ్రా చెక్



ఈకబురు, హైదరాబాద్, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్: సర్కారు భూముల్లో ఆక్రమణలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపారు. హైదరాబాద్ శివారులోని గాజులరామారంలో వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల్లో ఇళ్లు, గదులు నిర్మించిన వారి ఆగడాలకు చెక్ పెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎఫ్‌సీ)కు అప్పటి ప్రభుత్వం గాజులరామారంలోని 307 సర్వే నంబరులో 238.28 ఎకరాలు, 308 సర్వే నంబరులో 33.11 ఎకరాలను కేటాయించింది. నాలుగైదేళ్ల నుంచి కబ్జాదారులు ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించి విక్రయిస్తున్నారు.

తరువాయి 2లో

# జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భరత



- » దేశవ్యాప్తంగా అభివృద్ధి ఇక వేగవంతం
- » స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం
- » పేదలు, మధ్య తరగతి సహా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి
- » దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాలి
- » దేశ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు
- » పౌరులకు 'డబుల్ బొనాంజా' ఇచ్చామని స్పష్టీకరణ

తరువాయి 2లో

# శ్రీశైలం జలాశయం 10 గేట్లు ఎత్తివేత

- » సాగర్‌కు పోటెత్తిన వరద
- » 26 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు
- » ప్రాజెక్టు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు



ఈకబురు, శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్) : శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి నీటిని దిగువన నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 2,32,294, సుంకేసుల నుంచి 4,479, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. విద్యుదుత్పత్తి కోసం కుడి ఎడమ విద్యుత్ కేంద్రాల నుంచి 65,626, స్పిల్‌వే నుంచి 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటినిల్వ 209.5948 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

» 2లో



# నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలి

- » భారత్-పాక్ పోరు సహా ఏడు యుద్ధాలు ఆపాను
- » ట్రంప్ నోట మళ్లీ అదే మాట

న్యూయార్క్, వాషింగ్టన్: వాణిజ్యాన్ని చూపి భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని నిలువరించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పేర్కొన్నారు. మొత్తంమీద ఏడు యుద్ధాలను ఆపిన తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ వేదికపై గతంలో అమెరికా ఎన్నడూ పొందని గౌరవాన్ని ఇప్పుడు పొందేవిధంగా మనం వ్యవహరిస్తున్నామన్నారు. "మనం శాంతి ఒప్పందాలను కుదురుస్తున్నాం. మనం యుద్ధాలను నిలువరిస్తున్నాం. భారత్‌పాకిస్థాన్, థాయ్‌లాండ్‌కంబోడియా, అర్మేనియాఅజర్‌బైజాన్, కొసావోసెర్బియా, ఇజ్రాయెల్‌ఇరాన్, ఈజిప్టుఇథియోపియా, రువాండాకాంగోల మధ్య పోరును ఆపాం. వీటిలో 60 శాతం వాణిజ్యం అంశం ఆధారంగానే నిలిచాయి" అని శనివారం న్యూయార్క్‌లో జరిగిన అమెరికా కార్నర్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్స్ విందు కార్యక్రమంలో ట్రంప్ వివరించారు. రష్యాఉక్రెయిన్

తరువాయి2లో

# ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం



ఈ-కబురు,నేరేడుచర్ల, పాలకవీడు, హుజూర్‌నగర్: ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, దానిపై మరింత బలమైన వాదనలు వినిపించేందుకు సోమవారం ప్రముఖ సీనియర్ లాయర్లను సంప్రదించేందుకు తాను ఢిల్లీ వెళ్తున్నానని చెప్పారు

» 2లో

# తెలంగాణలో ఏ ఊరూ ఎవరి జాగీరు కాదు

- » త్వరలోనే కొంతమంది భరతం పడతా
- » జాగృతి అధ్యక్షురాలు కవిత

» 2లో



# హెచ్1బీ వీసా రుసుం పెంపు ఆందోళనకరం

ఈకబురు, హైదరాబాద్: అమెరికా ప్రభుత్వం హెచ్ 1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచడం ఆందోళనకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌అమెరికా సంబంధాల బలం ప్రతిభ, సాంకేతికత పరస్పర మార్పిడిలోనే ఉందని గుర్తుచేశారు. వీసా రుసుం పెంపు ప్రభావం తెలంగాణ యువతపై ఉంటుందన్నారు. భారత నిరుద్యోగులు, యువత ప్రయోజనాలను కాపాడేలా కేంద్ర ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళుతున్న ఐటీ నిపుణులకు ఇది ఆర్థిక భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీసా రుసుం పెంపుపై భారత ఐటీ కంపెనీలు, పరిశ్రమ సంఘాలు, ఎన్‌ఆర్‌ఐ నెట్‌వర్కులు ఒకే వేదికపైకి రావాలని పొన్నం పిలుపునిచ్చారు. ఇబ్బందులు ఎదుర్కొనే నిపుణుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం సహాయాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని వివరించారు.



మొదటి పేజీ తరువాయి

# ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును వ్యతిరేకిస్తున్నాం



ఈకబురు,నేరేడుచర్ల, పాలకవీడు, హుజూర్‌నగర్: ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ అంశం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందని, దానిపై మరింత బలమైన వాదనలు వినిపించేందుకు సోమవారం ప్రముఖ సీనియర్ లాయర్లను సంప్రదించేందుకు తాను ఢిల్లీ వెళ్తున్నానని చెప్పారు. తెలంగాణకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో కృష్ణా నదిపై నిర్మిస్తున్న జవహర్ ఎత్తిపోతల పథకం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ, అనంతరం హుజూర్‌నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. 'కృష్ణా జలాల విషయంలో గత పాలకులు పదేళ్లపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. 811 టీఎంసీల నీటిలో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలకు రాతపూర్వకంగా ఒప్పుకొన్నారు. మేము అధికారంలోకి వచ్చాక నదీ పరీవాహక ప్రాంతం, ఆయకట్టు, జనాభా పరిగణనలోకి తీసుకుని నీటిని కేటాయించాలని కోరుతున్నాం. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ముందు నేను స్వయంగా హాజరై వాదనలు వినిపించాను. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితచేవెళ్ల నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. కృష్ణా, గోదావరి నీటి హక్కుల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు ఎలాంటి పోరాటాలకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆలమట్టి ఎత్తు పెంపునకు గత పదేళ్ల నుంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు గందరగోళ రాజకీయాలు చేస్తున్నారు. అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంపై ఎన్‌డీఎస్‌ఏ, జల నిపుణులతో చర్చించాలని నిర్ణయించాం' అని మంత్రి ఉత్తమ వెల్లడించారు

# శ్రీశైలం జలాశయం 10 గేట్లు ఎత్తివేత



ఈకబురు, శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్): శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి వరద ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో ప్రాజెక్టు 10 గేట్లను ఎత్తి నీటిని దిగువన నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 2,32,294, సుంకేసుల నుంచి 4,479, హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. విద్యుదుత్పత్తి కోసం కుడి ఎడమ విద్యుత్ కేంద్రాల నుంచి 65,626, స్పిల్‌వే నుంచి 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటినిల్వ 209.5948 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



**సాగర్‌కు పోటెత్తిన వరద**

**26 గేట్ల ద్వారా విడుదల అవుతున్న నీరు**

నాగార్జునసాగర్, నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద రాగా డ్యాం నుంచి 26 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 3,33,743 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి చేరగా సాగర్ నుంచి 26 గేట్లలో 16 గేట్లు 5 అడుగులు, 10 గేట్లు 10 అడుగుల మేరకు ఎత్తి 2,70,938 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గేట్లతో పాటు కుడి కాలువ ద్వారా 9,500 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9,076 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్తు కేంద్రం ద్వారా 33,251 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 587.60 అడుగుల వద్ద ఉండగా ఇది 305.8626 టీఎంసీలకు సమానం.

మొదటి పేజీ తరువాయి

# అరుణాచల్, త్రిపురల్లో నేడు మోదీ పర్యటన



**రూ.3,700 కోట్ల విలువైన జలవిద్యుత్తు ప్రాజెక్టులకు శంకుస్థాపన**

ఈ-కబురు,ప్రధాని మోదీ సోమవారం అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఇరు రాష్ట్రాల్లోనూ సుమారు రూ.5 వేల కోట్ల విలువైన వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులను ఆవిష్కరించడంతో పాటు పలు అభివృద్ధి పనులనూ ప్రారంభిస్తారు. జల విద్యుదుత్పత్తికి ఎంతో అనువుగా ఉండే అరుణాచల్‌లో రూ.3,700 కోట్లతో నిర్మించనున్న తాతో-1, హియో జల విద్యుత్ కేంద్రాలు ప్రధాని శంకుస్థాపన చేసే ప్రాజెక్టుల జాబితాలో ఉన్నాయి. వీటితోపాటు 9,820 అడుగుల ఎత్తున ఉండే తవాంగ్‌లో నిర్మించనున్న భారీ కన్వెన్షన్ సెంటర్‌కూ ఆయన శంకుస్థాపన చేస్తారు. తొలుత ఈటానగర్‌లో పర్యటించే ప్రధాని.. శంకుస్థాపనలు, ప్రారంభ కార్యక్రమాల అనంతరం ప్రజలను ఉద్దేశించి సభలో ప్రసంగిస్తారు. అనంతరం త్రిపుర బయలుదేరుతారు. శక్తిపీఠాల్లో ఒకటైన గోమతి జిల్లా ఉదయ్‌పుర్‌లోని మాతా త్రిపుర సుందరి ఆలయ సముదాయం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఈ పర్యటనలో ప్రధాని వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశమవుతారని పీఎంవో ఓ ప్రకటనలో తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# జీఎస్టీ సంస్కరణలతో ఆత్మనిర్భరత



ఈకబురు,న్యూఢిల్లీ: తదుపరి తరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలతో దేశవ్యాప్తంగా అభివృద్ధి వేగం పుంజుకోనుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. 'ఆత్మనిర్భర్ భారత్' సాధన దిశగా ఇది అతిపెద్ద, కీలకమైన అడుగు అని అభివర్ణించారు. దేశ సౌభాగ్యం కోసం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచే అమల్లోకి రాబోతున్నాయని, నిత్యావసరాల ధరలు తగ్గుతాయని, పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రధాని మోదీ ఆదివారం దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'స్వదేశీ' ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి కొత్త శక్తిని ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రజలంతా స్వదేశీ ఉత్పత్తులు ఉపయోగించుకుంటే దేశ ఆర్థిక ప్రగతికి నూతన బలం చేకూరుతుందని వెల్లడించారు. దేశంలో ప్రతి ఇంటినీ స్వదేశీకి ప్రతీకగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రతి దుకాణాన్నీ స్వదేశీ వస్తువులతో అలంకరించాలని పిలుపునిచ్చారు. రూ.12 లక్షల దాకా ఆదాయంపై ఇప్పటికే పన్ను మినహాయింపు ఇచ్చామని, ఇప్పుడు జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చామని, ఈ రెండూ దేశ పౌరులకు 'డబుల్ బోనాంజా' అని స్పష్టంచేశారు. దీనివల్ల ఖర్చులు తగ్గి, డబ్బులు ఆదా చేయడం పెరుగుతుందని, తద్వారా ప్రజలు వారి కలలు నిజం చేసుకోవడానికి అవకాశం దక్కుతుందని వ్యాఖ్యానించారు. రెండు కీలక నిర్ణయాల వల్ల ప్రజలకు రూ.2.5 లక్షల కోట్లు ఆదా అవుతాయని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే..

**నాగరిక్ దేవో భవ**

"మన దేశం స్వావలంబన సాధించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలి. పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని రాష్ట్రాలు కల్పించాలి. తయారీ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాలి. ప్రజలు 'మేన్ ఇన్ ఇండియా' ఉత్పత్తులు విస్తృతంగా ఉపయోగించాలి. స్వదేశీ ఉత్పతుల కొనుగోలు, విక్రయం మన ధ్యేయం కావాలి. మన దేశంలో తయారైన వస్తువులు, సరుకులే వాడుకుంటున్నామని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలి. అప్పుడు మన దేశం ప్రగతి పథంలో పరుగులు తీస్తుంది. నాగరిక్ దేవో భవ(ప్రజలే దేవుళ్లు) అనేదే మా విధానం. ప్రజలకు మేలు చేయాలన్న తలంపుతోనే జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం చుట్టాం. ఈ నిర్ణయంతో కీలకమైన నిత్యావసర వస్తువులు, సేవల ధరలు తగ్గుతాయి. నిర్మాణం, ఆరోగ్య రంగంలోనూ ఖర్చులు తగ్గిపోతాయి. సోమవారం నుంచి 'జీఎస్టీ సేవింగ్స్ ఫెస్టివల్' ప్రారంభం కానుంది. ప్రతి కుటుంబానికీ సంతోషం తీసుకొస్తుంది. ఆత్మనిర్భర్ భారత్ కోసం ఈ నవరాత్రుల్లో తొలి రోజు దేశం కీలకమైన అడుగు వేయబోతోంది. మీకు ఇష్టమైన వస్తువులు తక్కువ ధరకే కొనుక్కోవచ్చు. పేదలు, మధ్య తరగతి, యువత, రైతులు, మహిళలు, వ్యాపారులు, దుకాణదారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారు. దేశంలో సులభతర వాణిజ్యం ఊపందుకుంటుంది. భారీగా పెట్టుబడులు వస్తాయి" అని మోదీ చెప్పారు.

**బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు..**

"2017లో జీఎస్టీ సంస్కరణలు ఆరంభించాం. చరిత్ర లిఖించడానికి అప్పుడే అడుగు పడింది. ఒకే దేశం-ఒకే పన్ను అనే స్వప్నాన్ని జీఎస్టీ నిజం చేసింది. గతంలో రకరకాల పన్నులు, సుంకాల వల్ల వ్యాపారులకు, వినియోగదారులకు ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యేవి. పన్నుల భారాన్ని వ్యాపారులు జనంపైనే వేసేవారు. జీఎస్టీతో ఆ కష్టాలకు చరమగీతం పాడేశాం. 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఓ విదేశీ పత్రికలో వార్త చదివా. బెంగళూరు నుంచి 570 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్‌కు సరుకులు చేరవేయడం ఓ కంపెనీకి పెద్ద సవాలుగా మారిందని అందులో రాశారు. పలు రకాల పన్నులు చెల్లించాల్సి వస్తోందని పేర్కొన్నారు. దానికి బదులు తొలుత యూరప్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేర్చడమే సులభమని ప్రస్తావించారు. అందుకే పన్నులపరంగా అవరోధాలు తొలగించాలని నిర్ణయించాం. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాలతో చర్చించి, జీఎస్టీని తీసుకొచ్చాం" అని ప్రధాన మంత్రి 'మోదీ వివరించారు.

**ఇకనుంచి 5, 18% శ్లాబ్‌లే..**

'సంస్కరణలతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈ) సైతం ప్రయోజనం పొందుతాయి. మేన్ ఇన్ ఇండియా ఉత్పత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎంఎస్ఎంఈలను కోరుతున్నా. స్వావలంబన భారత్ నిర్మాణంలో ఎంఎస్ఎంఈలదే కీలక పాత్ర. సాధ్యమైనంత ఎక్కువగా మన దేశంలోనే వస్తువులు ఉత్పత్తి చేయాలి. మనం ఉపయోగించుకుంటున్న వస్తువు ఎక్కడ తయారైందో ప్రజలు తెలుసుకోవాలి.

నిత్యం వాడుతున్న దువ్వెన ఎక్కడ తయారు చేశారో కూడా చాలామందికి తెలియదు. విదేశీ వస్తువులకు ప్రాధాన్యం వేయడం సరైంది కాదు. ఇకపై స్వదేశీ ఉత్పత్తులకే పెద్దపీట వేద్దాం. తగ్గిన జీఎస్టీ రేట్ల ప్రయోజనం ప్రజలకు దక్కేలా పరిశ్రమ వర్గాలు చొరవ చూపుతుండడం సంతోషంగా ఉంది. ఇకనుంచి 5 శాతం, 18 శాతం ట్యాక్స్ శ్లాబ్‌లే ఉంటాయి. గతంలో 12 శాతం పన్ను శ్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబ్‌లోకి తీసుకొచ్చాం. ఫలితంగా వాటి ధరలు గణనీయంగా తగ్గిపోతాయి' అని మోదీ అన్నారు.

# నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలి



భారత్‌పాకిస్థాన్, థాయ్‌లాండ్‌కంబోడియా, అర్మేనియాఅజర్‌బైజాన్, కొసావోసెర్బియా, ఇజ్రాయెల్‌ఇరాన్, ఈజిప్టుఇథియోపియా, రువాండాకాంగోల మధ్య పోరును ఆపాం. వీటిలో 60 శాతం వాణిజ్యం అంశం ఆధారంగానే నిలిచాయి" అని శనివారం న్యూయార్క్‌లో జరిగిన అమెరికా కార్నర్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్స్ విందు కార్యక్రమంలో ట్రంప్ వివరించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపితే నోబెల్ శాంతి బహుమతి వస్తుందని నాకు కొందరు చెప్పారు. మరి మొత్తం 7 యుద్ధాలను ఆపాను. వాటి సంగతేంటి? పుతిన్‌తో మంచి సంబంధాలు ఉండటంతో రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని సులభంగా నిలువరించవచ్చని మొదట్లో భావించాను. అయితే అది చాలా సంక్లిష్టంగా ఉంది. ఏదో ఒక రీతిలో రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగిస్తాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**న్యాయం జరగాల్సిన సమయమిది**

తన రాజకీయ శత్రువులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలంటూ అటార్నీ జనరల్ పామ్ బోండీని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. 'మనం ఇక ఆలస్యం చేయలేము. ఇది మన కీర్తి, విశ్వసనీయతను చంపేస్తుంది. వారు నన్ను రెండుసార్లు అభిశంసించారు. అభియోగాలు మోపారు. న్యాయం జరగాల్సిన సమయం వచ్చింది' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్‌లో రాసుకొచ్చారు. ఎఫ్‌బీఐ మాజీ డైరెక్టర్ జేమ్స్ కోమీ, కాలిఫోర్నియా డెమోక్రటిక్ సెనెటర్ ఆడమ్ షిఫ్, న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ ఈ పోస్టు పెట్టినట్లు తెలుస్తోంది. బోండీకి ట్రంప్ వ్యక్తిగతంగా మెసేజ్ పెట్టబోయి.. అందరికీ తెలిసేలా పెట్టారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. అయితే దీని గురించి అమెరికా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. మరోవైపు పామ్ బోండీని ప్రశంసిస్తూ ట్రంప్ మరో పోస్టు పెట్టారు. యూఎస్ అటార్నీ జనరల్‌గా ఆమె అద్భుతంగా పనిచేస్తున్నారన్నారు. కానీ, తన విధానాలను ముందుకు తీసుకెళ్లేందుకు వర్జీనియాలోని లిండ్సే హాలిగాన్ వంటి ప్రాసిక్యూటర్ అవసరమని అభిప్రాయపడ్డారు. ఆమెను యూఎస్ అటార్నీగా నామినేట్ చేస్తానని ప్రకటించారు. లిండ్సే అందరికీ సమాన న్యాయం చేస్తారని వ్యాఖ్యానించారు.

# తెలంగాణలో ఏ ఊరూ ఎవరి జాగీరు కాదు



సిద్దిపేట, చింతమడకకు ఎవరు రావాలన్నా కేజీఎఫ్‌లా ఆంక్షలు విధిస్తున్నారు
త్వరలోనే కొంతమంది భరతం పడతా
జాగృతి అధ్యక్షురాలు కవిత

ఈకబురు,సిద్దిపేట, దుబ్బాక, : 'కొంత మంది స్వార్థపూరిత కుట్రలతో కేసీఆర్‌కు మచ్చ తెచ్చారు. ఆ విషయాన్ని నేను చెబితే, నన్ను కుటుంబం నుంచి విడగొట్టారు' అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తండ్రి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వగ్రామం సిద్దిపేట జిల్లాలోని చింతమడక గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్గంలో సిద్దిపేట పట్టణంలోని చౌరస్తా వద్ద జాగృతి కార్యకర్తలు సన్మానించారు. సీఎం..సీఎం అంటూ నినాదాలు చేశారు. చింతమడకలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'చింతమడక ఉద్యమ గడ్డ. ఈ మట్టి నుంచే తెలంగాణ ఉద్యమం పుట్టింది. ఈ గ్రామం అందించిన పులే.. కేసీఆర్. అన్ని కులాలను, మతాలను కలుపుకోవాలని ఈ గ్రామం నేర్పింది. 2004లో సిద్దిపేట ఎమ్మెల్యేగా కేసీఆర్ రాజీనామా చేసి, ఎంపీగా ఎన్నికవడంతో ఇక్కడి నుంచి మరో వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించారు. ఆనాటి నుంచి నేటి వరకు.. సిద్దిపేట, చింతమడకకు ఎవరు రావాలన్నా.. అదేదో ప్రైవేటు ప్రాపర్టీలాగా, కేజీఎఫ్‌లాగా ఆంక్షలు విధిస్తున్నారు. తెలంగాణ ప్రజలు ఎవరి ఆంక్షలకు భయపడరు. తెలంగాణలో ఏ ఊరూ ఎవరి జాగీరు కాదు. త్వరలోనే కొంతమంది భరతం పడతా. ప్రస్తుతం కుటుంబాన్ని దూరం చేశారనే తీవ్ర బాధ, దుఃఖంతో ఉన్నా. అండగా నిలిచిన చింతమడక గ్రామస్థులకు ధన్యావాదాలు తెలియజేస్తున్నా" అని కవిత అన్నారు.

# ఆక్రమణలపై హైడ్రా

దీనిపై పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ రంగనాథ్ రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి శనివారం అక్కడి ఆక్రమణలను పరిశీలించారు. సీఎంవో ఉత్తర్వుల మేరకు ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా, రెవెన్యూ, జీహెచ్ఎంసీ సిబ్బంది పొక్లెయిన్‌లతో వచ్చారు. 10 బృందాలుగా విడిపోయి ఆక్రమణల కూల్చివేతలు ప్రారంభించారు. సుమారు 275 నిర్మాణాలను నేలమట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం భూముల విలువ రూ.15 వేల కోట్లు అని.. వీటి రక్షణకు కంచెలు ఏర్పాటు చేస్తామని వివరించారు. 342, 345 సర్వే నంబర్లలో వెలసిన నిర్మాణాలను కూల్చివేయడానికి సిబ్బంది వెళ్లగానే స్థానికులు అడ్డుకుని హైడ్రా సిబ్బందిపై రాళ్లతో దాడికి దిగారు. పలువురు సిబ్బందికి స్వల్పగాయాలవ్వగా ఉద్రిక్త పరిస్థితి ఏర్పడి కూల్చివేతలను నిలిపివేశారు. మిగిలిన ఆక్రమణలపై తదుపరి ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు మల్కాజిగిరి ఆర్డీవో శ్యాంప్రకాశ్ తెలిపారు.

**కబ్జాలకు చెక్ పెట్టాం: రంగనాథ్**

గాజులరామారం సర్వే నంబర్లు 329/1, 342లో ఉన్న ప్రభుత్వ భూమిని 60, 120 గజాల ప్లాట్లు చొప్పున ఇష్టారీతిన చేసిన కబ్జాలకు చెక్ పెట్టినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఆక్రమణలను కూల్చివేసి 317 ఎకరాల భూమికి కబ్జాల నుంచి విముక్తి కల్పించామని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. "ప్లాట్లు అమ్మేసుకున్న రౌడీషీటర్లు, స్థానిక చోటామోటా నాయకులకు చెక్ పెట్టాం. జగద్గిరిగుట్ట ఠాణాలో రౌడీషీట్ ఉన్న షేక్ అబిద్.. లక్ష్మిమురళి, హుస్సేన్‌ల పేరిట ప్లాట్లు విక్రయించాడు. బోడాసు శ్రీనివాస్ (డాన్ శ్రీను), ఏసుబాబు, సయ్యద్ గౌస్‌బాబు, మనీష్, దేవా ఇలా ఎవరికి వారు ఆక్రమించేసి ప్లాట్లుగా అమ్మేసుకున్న వారిపై చర్యలు తీసుకున్నాం. కొందరు స్థానిక అధికారులు సహకరించినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేపట్టాం. ఇప్పటికే నివసిస్తున్న వారి ఇళ్ల జోలికి వెళ్లలేదు. రౌడీల అధీనంలో ఉండి అమ్మకానికి సిద్ధంగా ఉన్న వాటినే హైడ్రా తొలగించింది" అని పేర్కొన్నారు.



# మత్తు పదార్థాలతో దేశానికి పెనుముప్పు



యువత వాటికి దూరంగా ఉండాలి

'నమో యువ రన్'లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఖైరతాబాద్, :'మద్యం, ఇతర మత్తు పదార్థాలు దేశానికి పెనుముప్పుగా పరిణమించాయి. యువతను పతనం చేసేందుకే వివిధ దేశాల నుంచి డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నారు. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకునేందుకు యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. దేశం నుంచి ఆ మహమ్మారిని పూర్తిగా పారదోలాలి" అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ 75వ పుట్టినరోజును పురస్కరించుకుని.. యువత డ్రగ్స్ నుంచి బయటపడాలన్న సందేశంతో బీజేవైఎం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'నమో యువ రన్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన 3కే మారథాన్‌ను కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 'మోదీ ప్రధాని కాక ముందు దేశంలో రోజూ కుంభకోణాలు వెలుగుచూసేవి. 11 ఏళ్ల పాలనలో ఆయన అనేక సంస్కరణలు చేపట్టారు. దేశం ఆర్థికంగా దూసుకెళ్తోంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలవాలన్నా.. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి.. పారిశ్రామిక అభివృద్ధి జరగాలన్నా.. స్వదేశీ ఉత్పత్తులు వాడాలి' అని కోరారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. యువకులు ఆన్‌లైన్ గేమింగ్‌తో రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారని, ఇలాంటి వాటికి బానిసలు కావొద్దనే ప్రధాని దేశంలో ఆన్‌లైన్ గేమ్‌లను రద్దు చేశారన్నారు. భాజపా రాష్ట్రాధ్యక్షుడు రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రధాని జన్మదిన వేడుకల్లో భాగంగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఎన్‌హెచ్ ప్రాజెక్టుల సమస్యలు తొలగేనా!

ఈకబురు, హైదరాబాద్: జాతీయ రహదారుల భూసేకరణ, అటవీ సమస్యలు, యుటిలిటీ ఛార్జీలే ప్రధాన అంశాలుగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ(మోర్త్), భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారుల సమావేశం జరగనుంది. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సూచనతో దిల్లీ నుంచి ప్రత్యేక అధికారులు వస్తుండడంతో పూర్తిస్థాయిలో రాష్ట్రంలో కొనసాగుతున్న జాతీయ రహదారుల ప్రాజెక్టులపై చర్చించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధం అయ్యాయి. క్షేత్రస్థాయిలో అనుమతుల పేరుతో ఇబ్బందులు రావడంతో పలు చోట్ల ఎన్‌హెచ్ రహదారుల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే రోడ్లుభవనాలు, అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సీఎంతో జరిగే సమీక్షపై మూడు రోజులుగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. మోర్త్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సైతం రహదారుల నిర్మాణంలో ఎక్కడెక్కడ సమస్యలు తలెత్తుతున్నాయో అనే అంశాలపై ఈ నెల 17న అంతర్గత సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయి నివేదికను తయారు చేశారు. మరోవైపు జాతీయ రహదారుల ప్రాజెక్టులతో పాటు ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్‌అమరావతి ఎక్స్‌ప్రెస్ గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

కొన్ని చోట్ల ఇబ్బందులివే..

ఎన్‌హెచ్ 163జీ పరిధిలోని నాగ్‌పూర్‌విజయవాడ కారిడార్‌లో మంచిర్యాలవరంగల్‌ఖమ్మంవిజయవాడ సెక్షన్ భూసేకరణపై పలు చోట్ల ఇబ్బందులున్నాయి. ఎన్‌హెచ్63 పరిధిలోని ఆర్మూర్‌జగిత్యాలమంచిర్యాల రోడ్డు భూసేకరణలో అక్కడక్కడ సమస్యలున్నాయి. ఎన్‌హెచ్163 పరిధిలోని హైదరాబాద్‌మన్నెగూడ సెక్షన్‌లో పెద్ద సంఖ్యలో మర్రి చెట్లు ఉన్నాయి. కోర్టులో కేసులు ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు.

ఎన్‌హెచ్ 563లోని జగిత్యాలకరీంనగర్ రహదారిపై, ఎన్‌హెచ్765 పరిధిలోని హైదరాబాద్‌శ్రీశైలం సెక్షన్, ఎన్‌హెచ్ 167కే పరిధిలోని కృష్ణానదిపై ఐకానిక్ వంతెన, హైదరాబాద్‌రాయ్‌పూర్ రోడ్డు, బెల్లంపల్లిగడ్చిరోలిదుర్గ్ గ్రీన్‌ఫీల్డ్ తదితర రహదారులపై పూర్తిస్థాయిలో చర్చించనున్నారు.

మంచిర్యాల, కామారెడ్డి, మేడ్చల్, మెదక్, నిజామాబాద్, భూపాలపల్లి, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రోడ్ల విస్తరణలో అటవీ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిపై ఈ సమావేశంలో ఓ స్పష్టతకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



# పాలస్తీనాను దేశంగా గుర్తించిన బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా





ఈకబురు:బ్రిటన్ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అమెరికా, ఇజ్రాయెల్‌ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ.. పాలస్తీనా (Palestine)ను అధికారికంగా దేశంగా గుర్తించింది. బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఈ విషయాన్ని ప్రకటించారు. పాలస్తీనీయులు, ఇజ్రాయెల్ పౌరుల్లో శాంతిస్థాపన ఆశలను పునరుద్ధరించేందుకు, ద్విదేశ పరిష్కారం కోసం ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కెనడా, ఆస్ట్రేలియాలు సైతం ఈమేరకు ప్రకటన చేశాయి.

గాజాలో కాల్పుల విరమణకు, ఐరాస సాయం అనుమతికి, దీర్ఘకాలిక శాంతికి ఇజ్రాయెల్ అంగీకరించకపోతే.. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తామని జులైలోనే స్టార్మర్ (Keir Starmer) ప్రకటించారు. ఇటీవల బ్రిటన్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump).. స్టార్మర్ ప్రభుత్వ ప్రణాళికలను వ్యతిరేకించారు. ఈ విషయంలో ప్రధాని స్టార్మర్‌తో విభేదాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు 140కి పైగా దేశాలు పాలస్తీనాను దేశంగా గుర్తించాయి. త్వరలోనే ఫ్రాన్స్ తదితర దేశాలూ ఈమేరకు ప్రకటనలు చేయనున్నట్లు సమాచారం.

పాలస్తీనాను దేశంగా గుర్తించే విషయంలో బ్రిటన్ తదితర దేశాల ప్రణాళికలను అమెరికా, ఇజ్రాయెల్ (Israel) దేశాల ప్రతినిధులు ఇప్పటికే ఖండించారు. ఉగ్రవాదంతోపాటు 2023 అక్టోబరు 7నాటి దాడుల విషయంలో హమాస్‌కు బ్రిటన్ బహుమతి ఇచ్చినట్లు ఇజ్రాయెల్ విదేశాంగశాఖ విమర్శించింది.

# జీఎస్టీ సంస్కరణలతో జరిగే నష్టమేంటి?



జీఎస్టీ సంస్కరణలతో జరిగే నష్టమేంటో చెప్పకుండా... కొందరు అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. సమస్యలను గుర్తిస్తే కేంద్రంతో మాట్లాడుకుని పరిష్కరించుకోవచ్చని సూచించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లో భాజపా జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ మేయర్ వై. సునీల్‌రావుతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... "నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబావుటా ఎగరవేసిన గొప్ప వ్యక్తి కొండాలక్ష్మణ్ బాపూజీ. తెలంగాణ ఉద్యమ, చేనేత సహకారోద్యమ నేత. 97 ఏళ్ల వయసులోనూ ప్రత్యేక రాష్ట్రం కోసం దిల్లీలో దీక్ష చేశారు" అని గుర్తుచేశారు. "జీఎస్టీ సంస్కరణలపై కొందరు ఇడ్లీ, దోశ, వడ, సౌత్, నార్త్ అంటూ అర్థరహితంగా మాట్లాడుతున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దక్షిణాది వ్యక్తే కదా... ఏవైనా ఇబ్బందులుంటే ఆమెతో మాట్లాడి పరిష్కరించుకోవచ్చు. నష్టం జరిగితే ప్రజలకూ చెప్పవచ్చు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా... ఈ నెల 22 నుంచి 29 వరకు జీఎస్టీ సంస్కరణలతో జరిగిన ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం" అని సంజయ్ వివరించారు.

# ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శత జయంతి ఉత్సవాలు ప్రారంభం





కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హనుమత్ ప్రసాద్



ఉత్సవాల్లో పాల్గొన్న స్వయంసేవకులు

**ప్రశాంత్ నగర్ బస్తీలో కన్నుల పండువగా విజయదశమి ఉత్సవం**

**శక్తి సహితమే శివం - శక్తి రహితమే శవం : తాడేపల్లి హనుమత్ ప్రసాద్**

ఈకబురు, శేరిలింగంపల్లి : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తయిన సందర్భంగా శేరిలింగంపల్లి ప్రశాంత్ నగర్ బస్తీలో శతజయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం విజయదశమి ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీ విద్యాసంస్థల చైర్మన్ డిబి రావు ముఖ్యఅతిథిగా, వనవాసి కళ్యాణాశ్రమం ప్రాంత సహ కోశాధికారి తాడేపల్లి హనుమత్ ప్రసాద్ ముఖ్య వక్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భారతదేశం ఎన్నో దాడులను ఎదుర్కొని తట్టుకొని నిలబడగలిగిందని అన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో మనమంతా ఒక్కటిగా కలిసి పోరాటం చేసేలా సమిష్టి భావన పెంపొందించాలనే ఉద్దేశంతో 1925 లో డాక్టర్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్థాపించారని అన్నారు. నాటి నుండి నేటి వరకు ఎన్నో ఆటుపోట్లను, పరీక్షలను ఎదుర్కొని ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాలను పూర్తి చేసుకున్నదని అన్నారు. ఎక్కడ ప్రకృతి విపత్తులు సంభవించినా మొదట సేవలో నిమగ్నమయ్యేది స్వయం సేవకులేనని అన్నారు. నాటి దివిసీమ ఉప్పెన ఐనా, నిన్న మొన్నటి కరోనా విపత్కర పరిస్థితులైనా.. సంఘ కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో బాధ్యతగా వ్యవహరించారన్నారు. శక్తి సహితమే శివం శివం... శక్తి రహితమే శవం శవం...కాబట్టి అందరూ సంఘటితమై ఉండాలన్నారు. కుటుంబ విలువలు కాపాడాలని, స్వదేశీ వస్తువులను వాడాలని, పర్యావరణ పరిరక్షణ. పౌర విధులకు కట్టుబడటం. సామాజిక సమరసత అంటే అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉత్సవంలో భాగంగా మొదట ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది గణ వేషధారి స్వయం సేవకులతో పాటు ఆదర్శనగర్ కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న స్వయంసేవకులు

# పరాయి ఇంటికి.. 'కిరాయి' కష్టం



ఈ-కబురు బెంగళూరు (మారతహళ్లి), దేశ ఐటీ రాజధాని, సిలికాన్ సిటీగా పేరొందిన బెంగళూరులో ఇళ్ల అద్దెలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. జీతంలో సింహభాగం ఇంటి అద్దెకే వెచ్చించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయమై సోషల్ మీడియా వెబ్ సైట్ 'రెడిట్'లో ఓ నెటిజన్ పెట్టిన పోస్టు నెటిజన్లలో.. ముఖ్యంగా టెకీల్లో తీవ్ర చర్చకు దారితీసింది. 'బెంగళూరులోని ఓ ఫ్లాట్‌కు నెలకు రూ.70 వేల అద్దె చెప్పడమే కాకుండా.. రూ.5 లక్షల డిపాజిట్ అడుగుతున్నారు' అంటూ అతడు తన పోస్టులో పేర్కొన్నాడు. అసలే రోడ్లపై రద్దీ సమస్య, చిన్న వర్షా నికే జలమయమయ్యే పణత్తూరు ప్రాంతంలోని ఫ్లాట్‌కు ఇంత భారీ మొత్తంలో బాడుగ, డిపాజిట్ ఏమిటంటూ అతడు వాపోయాడు. ఈ పోస్టుపై సామాజిక మాధ్యమంలో భారీగా చర్చ నడుస్తోంది. ఎంతోమంది ప్రతిస్పందిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

యజమానికి వందనాలు..

'ఇంటి అద్దెలు ఇంత దారుణంగా ఉంటే బతకడం ఎలా?' అని పలువురు అభిప్రాయపడ్డారు.

'కార్యాలయానికి దగ్గరగా ఉంటే చాలు.. కొందరు అగ్గిపెట్టె సైజు ఇంటికైనా భారీ అద్దె చెల్లిస్తారంటూ' పేర్కొన్న ఓ నెటిజన్ 'అలాంటి వారు రైల్వే అండర్ పాస్ వద్ద చిక్కుకుపోతారంటూ' చమత్కరించాడు.

'అలాంటిచోట ఫ్లాట్‌కు నెలకు రూ.70 వేలు అద్దె.. వావ్! యజమానికి వందనాలు' అంటూ మరొకరు కామెంట్ చేశారు.

'పణత్తూరులోనే కొన్నిచోట్ల సగటు బాడుగ రూ.41 వేలే ఉంది. ఇక్కడ నెలకు రూ.70 వేల అద్దె చెల్లిస్తారంటే నమ్మలేకపోతున్నానని' మరో వినియోగదారుడు పేర్కొన్నాడు.

స్థానికులు మాత్రం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అద్దెలు మారుతుంటాయని అభిప్రాయపడుతున్నారు.

కొవిడ్ తర్వాత పైపైకి!

సాధారణంగా ముంబయి, దిల్లీలలో అద్దెలతో పోలిస్తే బెంగళూరులో అద్దెలు కొంత తక్కువేనని భావించేవారు. కానీ కొవిడ్ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. ఐటీ ఉద్యోగులు తిరిగి కార్యాలయాలకు హాజరవుతుండడం, కొత్త ఇళ్ల నిర్మాణాలు తగ్గడం, రోడ్లపై ట్రాఫిక్ భయంతో కార్యాలయాలకు సమీపంలో ఉండడానికే ఎక్కువమంది మొగ్గు చూపడం వంటి అంశాలు బెంగళూరులో ఇళ్లు, ఫ్లాట్ల అద్దెలు విపరీతంగా పెరగడానికి కారణాలుగా నిలుస్తున్నాయి.

మల్లేశ్వరం వంటి ప్రాంతాల్లో త్రీబెడ్ రూమ్ ఫ్లాట్ అద్దె రూ. లక్ష పైనే ఉండగా, 11 నెలల డిపాజిట్ వసూలు చేస్తున్నారు. ఇల్లు ఖాళీ చేసి వెళ్లేటప్పుడు రిపేర్లు, పెయింటింగ్ కోసమంటూ దాదాపుగా ఒక నెల అద్దె డబ్బులను డిపాజిట్‌లోంచి కోత పెట్టడం చాలా మామూలు ఇక్కడ.

# నేటి నుంచి 'జీఎస్టీ' తగ్గింపు ఉత్సవం




ఇక 12 శాతం; 28 శాతం ఉండవు...

సేల్‌స్ట్యాక్స్, వ్యాట్, సెంట్రల్ ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ సహా పలు రకాల పరోక్ష పన్నులన్నిటినీ తొలగిస్తూ 2017 జూలై నుంచీ గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) అమల్లోకి వచ్చింది. తక్కువ పన్నురేట్లుండాలని మొదట లక్ష్యించినా సాధ్యం కాలేదు. తాజా సవరణలతో అది సాధ్యమై జీఎస్టీ శ్లాబ్‌లు 3కు తగ్గాయి. తక్కువ శ్లాబ్‌లుంటే పాలన, ధరల నిర్ణయం, బిల్లింగ్ సులువవుతుంది. పన్ను అధికారులపైనా భారం తగ్గుతుంది. జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాల్లో అత్యంత ప్రధానమైనది.. 12 శాతం, 28 శాతం పన్ను రేట్లను పూర్తిగా తొలగించటం.

కొన్ని విలాస, అనారోగ్య (సిన్) వస్తువుల కోసం 40 శాతం పన్ను రేటును చేర్చటం. వాస్తవంగా చూస్తే చాలావరకూ ఆహార పదార్థాలు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ 5% పరిధిలోకి వచ్చాయి. కొన్నింటిపై పన్నే లేకుండా చేశారు. గతంలో వీటిపై 12, 28 శాతం పన్ను రేట్లుండేవి. ఇది అత్యధికులకు ఊరటే. ఇక కొన్ని విలాస వస్తువులు, కూల్‌డ్రింక్స్, టొబాకో ఉత్పత్తులు, పాన్ మసాలా వంటివి మాత్రం 28 శాతం పన్ను పరిధిలో ఉండగా ఇపుడు 40 శాతం శ్లాబ్‌లోకి వెళ్లాయి.

తగ్గింపు ప్రయోజనాలు ఎక్కువే...

ముఖ్యంగా ప్రాణాధార ఔషధాలపై పన్ను భారం తొలగిపోనుంది. మరెన్నో ఔషధాలు, వైద్య పరికరాలు, ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులైన టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్, సబ్బులు, షాంపూలు, హెయిర్ ఆయిల్, టాల్కమ్ పౌడర్, షేవింగ్ క్రీమ్‌తో పాటు నెయ్యి, పన్నీరు, బటర్, నమ్కీన్, కెచప్, డ్రై ఫ్రూట్స్, కాఫీ దగ్గర్నుంచి.. పెద్ద సైజు టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, కార్ల వరకు మొత్తం 375 ఉత్పత్తుల ధరలు గతంతో పోల్చితే తగ్గనున్నాయి.

ఈ తగ్గింపు వల్ల జనం చేతుల్లో మరికొంత డబ్బు మిగులుతుంది కనక ఇది సేవింగ్స్‌లోకి, స్టాక్ మార్కెట్లోకి మళ్లే అవకాశం ఉందనేది ప్రభుత్వం అంచనా. అంతిమంగా ఇది ఆర్థిక వృద్ధికి దారితీయాలనేది లక్ష్యం. అయితే అదే తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు తగ్గిపోకూడదు కనక విలాస, అనారోగ్య వస్తువులపై ఏకంగా పన్ను శాతం 40కి పెంచారు.

ధర పెరిగే వస్తువులివీ..

బీడీ మినహా సిగరెట్లు, సిగార్లు, గుట్కా, పాన్ మసాలా, నికొటిన్ ఉత్పత్తులు గతంలో ఉన్న 28 శాతం నుంచి 40 శాతానికి చేరాయి. అయితే ఈ పెంపు ప్రస్తుతానికి అమల్లోకి రాదు. బీడీలపై పన్నును మాత్రం 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించారు. బిహార్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో సిగరెట్లు తాగేవారికన్నా బీడీలు కాల్చేవారు దాదాపు మూడురెట్లు ఎక్కువనేది గమనార్హం.

కార్బొనేటెడ్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్, కెఫైన్ ఆధారిత పానీయాలను 28 నుంచి 40 శాతంలోకి చేర్చారు.

లాటరీ టికెట్లు, కేసినో సేవలు, ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారాలపై పన్ను రేటు 40 శాతంగా నిర్ణయించారు.

1,500 సీసీకన్నా ఎక్కువ సామర్థ్యం ఉన్న ఎస్‌యూవీలు, హై-ఎండ్ కార్లపై ఇకపై 40 శాతం జీఎస్టీ అమలవుతుంది.

ఫ్యాట్స్, చక్కెర, ఉప్పు ఎక్కువగా ఉండే ఫాస్ట్ ఫుడ్స్, ప్యాకేజ్డ్ స్నాక్స్ కూడా ఇకపై 40 శాతం శ్లాబ్‌లోకి వస్తాయి.

మధ్యతరగతిపై ప్రభావమెంత?

మధ్య తరగతి ప్రజలకు ఈ సవరణల్లో ఎక్కువ లాభం తెచ్చేవి ఏవైనా ఉన్నాయంటే అవి కిరాణా సరుకులు, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులే. చాలా వస్తువులు 18, 12 శాతాల నుంచి 5 శాతం పరిధిలోకి రావటమే ఇందుకు కారణం. ఇక ఔషధాలు, బీమా రూపేణా కలిసొచ్చేది ఎక్కువే. అందుకే ప్రతి నెలా కొంత కచ్చితంగా ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది. పట్టణ మధ్య తరగతి కుటుంబాల్లో ఈ నెలవారీ ఆదా మందులను కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ.1700 నుంచి రూ.2200 వరకూ ఉండవచ్చనేది నిపుణుల అంచనా.

పైపెచ్చు ఈ జీఎస్టీ సవరణల్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అందుకే ఏ వస్తువుపై ఎంత తగ్గిందనేది ప్రతి తయారీదారూ కచ్చితంగా ప్రకటించాలనే నియమాన్ని పెట్టింది. ఈ మేరకు తయారీదారులు రకరకాల ప్రకటనలు చేస్తున్నారు. ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం కల్పిస్తోంది. పైపెచ్చు ఉత్పత్తిదారులు తగ్గించినా రిటైల్ అమ్మకందారులు తగ్గించకపోతే పన్ను తగ్గింపు ప్రయోజనం జనానికి చేరదు కనక ఈ అమలు తీరును 6 నెలల పాటు నిశితంగా పర్యవేక్షించనుంది కూడా.

ఏవి చౌకగా లభిస్తాయంటే..

వెన్న, నెయ్యి, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, యూహెచ్‌టీ మిల్క్ వంటివి గతంలో 12, 5 శాతాల్లో ఉండగా ఇపుడు 5, సున్నా శాతాల్లోకి వచ్చాయి.

బిస్కెట్లు, కేక్‌లు, పాస్తా, ఓట్స్, కార్న్‌ఫ్లేక్స్ వంటి బ్రేక్‌ఫాస్ట్ సిరెల్స్, చీజ్ పఫ్‌లు, పలు రకాల కన్ఫెక్షనరీ ఉత్పత్తులు గతంలో ఉన్న 18 నుంచి 5 శాతానికి దిగివస్తాయి.

వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులైన షాంపూలు, తల నూనె, టూత్‌పేస్ట్, సబ్బులు చాలావరకూ గతంలో 18 శాతంలో ఉండగా ఇపుడు 5 శాతం పరిధిలోకి వచ్చాయి. ఆహార దినుసులతో పాటు శీతల పానీయాల పరిధిలోకి రాని జ్యూస్‌లు, మొక్కల ఆధారిత మిల్క్ డ్రింక్‌లు, పలురకాల డ్రైఫ్రూట్స్ గతంలో 12, 28 శాతాల్లో ఉండగా ఇపుడు 5 శాతానికి వచ్చాయి.

చిన్న, మిడ్‌సైజ్ కార్లపై గతంలో ఉన్న 28 శాతం పన్నును 18 శాతానికి తగ్గించారు. వాహనాల ధర ఎక్కువ కనక ఈ పన్ను తగ్గింపు ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే దాదాపు అన్ని కంపెనీలూ జీఎస్టీ సవరణకు అనుగుణంగా తమ ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించాయి.

32 అంగుళాలకు మించి ఉన్న టీవీలపై ఇప్పటి వరకు ఉన్న 28 శాతం జీఎస్టీ కాస్తా 18 శాతం కిందకు వచ్చింది. దీంతో వాటి మోడళ్ల ఆధారంగా రూ.2,500 నుంచి రూ.85,000 వరకు ధరలు తగ్గాయి. ప్రముఖ కంపెనీలు సోనీ, ఎల్‌జీ, ప్యానాసోనిక్ ఇప్పటికే కొత్త ధరలను ప్రకటించాయి. ఏసీలు, కొన్ని రకాల వాషింగ్ మెషీన్లపైనా జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గింది.

నిర్మాణంలోకి వినియోగించే సిమెంట్, ఇతర బిల్డింగ్ మెటీరియల్స్‌పైనా జీఎస్టీ తగ్గించడమనేది ఇళ్ల మార్కెట్‌కు అనుకూలించనుంది.

ముందు వరుసలో కార్ల కంపెనీలు...

మారుతి సుజుకీలో ప్రారంభ శ్రేణి కార్లు అయిన ఎస్‌ప్రెస్సోపై రూ.1,29,600, ఆల్టో కే10పై రూ.1,07,600 వరకు ధర తగ్గింది. గ్రాంట్ విటారాపై రూ.1.07 లక్షలు, ఎక్స్‌ఎల్ 6పై రూ.52,000, ఎర్టిగాపై రూ.46,400 వరకు ధర తగ్గిస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. ఇతర అన్ని మోడళ్లపైనా ధరలు తగ్గాయి.

టాటా మోటార్స్ తన పంచ్ ఎస్‌యూవీపై రూ. 85,000, నెక్సాన్‌పై రూ.1.55 లక్షల వరకు ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కర్వ్‌పై రూ.65,000, హ్యారియర్, సఫారీ ధరలు రూ.1.45 లక్షల వరకు తగ్గాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా తన మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.1.56 లక్షల వరకు తగ్గించింది. ఇందులో పాపులర్ మోడల్ బొలెరో ధర రూ.1.27 లక్షలు తగ్గింది. థార్ డీజిల్ వేరియంట్లపై రూ.1.35 లక్షల వరకు తగ్గింది.

కియా కార్ల ధరలు రూ.4.48 లక్షల వరకు చౌక అవుతున్నాయి. మెర్సిడెస్ బెంజ్ తన విలాస కార్లు ఏ-క్లాస్‌పై రూ.2 లక్షల వరకు, ఎస్-క్లాస్‌పై రూ.10 లక్షల వరకు ధరలు తగ్గించింది. బీఎండబ్ల్యూ కార్ల ధరలు రూ.13.6 లక్షల మేర తగ్గాయి. జాగ్వార్ ల్యాండ్ రోవర్ వాహన ధరలు రూ.4.5-30.4 లక్షల మధ్య తగ్గాయి. హీరో మోటోకార్ప్ బైక్‌లు, స్కూటర్ల ధరలు రూ.15,743 వరకు, హోండా మోటార్ సైకిల్ వాహన ధరలు 350 సీసీలోపు ఉన్నవాటిపై రూ.18,800 వరకు తగ్గాయి.

వీటిపై ఇక నో జీఎస్టీ

జీవిత బీమా, ఆరోగ్య బీమాపై ఇప్పటి వరకు 18 శాతం జీఎస్టీ అమల్లో ఉండగా, పూర్తి మినహాయింపు ఇచ్చారు. దీంతో ఈ మేరకు పాలసీ ప్రీమియం ధరలు తగ్గుతాయి. జీవిత బీమా పాలసీల్లోనూ ఎన్నో రకాలున్నాయి. వీటిపై భిన్నమైన జీఎస్టీ అమలవుతోంది. టర్మ్ ఇన్సూరెన్స్‌పై 18 శాతం... ఎండోమెంట్ ప్లాన్లపై మొదటి ఏడాది 4.5 శాతం.. రెండో ఏడాది నుంచి 2.25 శాతం చొప్పున కాల వ్యవధి ముగిసే వరకు ప్రీమియంపై జీఎస్టీ చెల్లించాల్సి వచ్చేది. సింగిల్ ప్రీమియం పాలసీలపై 1.8 శాతం, యులిప్ ప్లాన్లపై (పెట్టుబడి భాగం కాకుండా, బీమా రక్షణ చార్జీలపైనే) 18 శాతం అమల్లో ఉంది.

వీటన్నింటిపై జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. ఇకపై ఈ మేరకు ప్రీమియం భారం తగ్గుతుంది. కేన్సర్, జన్యు సంబంధిత, అరుదైన వ్యాధులు, గుండె జబ్బులకు వినియోగించే 33 ఔషధాలను జీఎస్టీ నుంచి మినహాయించారు. వీటికి తోడు 12 శాతం పరిధిలో ఉన్న పలు ఔషధాలను 5 శాతం శ్లాబుకు మార్చడంతో ఈ మేరకు ఉపశమనం లభించనుంది. గ్లూకో మీటర్లు, డయాగ్నోస్టిక్స్ కిట్లు కూడా 5 శాతం కిందకు మారాయి. ఈ మేరకు ఎంఆర్‌పీలను సవరించాలని, లేదంటే పాత ఎంఆర్‌పీ రేట్లపై తగ్గించి విక్రయించాలని (సెప్టెంబర్ 22 నుంచి) ఔషధ కంపెనీలను ప్రభుత్వం ఆదేశించింది.

## ఈ వారంలో 28 ఐపీఓలు




ఈ వారం ఏకంగా 28 కంపెనీలు ఐపీఓ ద్వారా నిధులు సమీకరించబోతున్నాయి. ఆనంద్ రాఠీ, జారో ఎడ్యుకేషన్‌తో పాటు 11 ఐపీఓలు ప్రధాన (మెయిన్‌బోర్డ్) విభాగంలో రానున్నాయి. చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) విభాగంలో 17 ఇష్యూలు రాబోతున్నాయి. వాటి వివరాలివీ..

మెయిన్‌బోర్డ్ ఐపీఓలు: అట్లాంటా ఎలక్ట్రికల్స్, గణేశ్ కన్జూమర్ ప్రోడక్ట్స్, జారో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, సోలార్‌వరల్డ్ ఎనర్జీ సొల్యూషన్స్, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్, శేషసాయి టెక్నాలజీస్, జైన్ రిసోర్స్ రీసైక్లింగ్, ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ వెంచర్స్, ట్రాల్ట్ బయోఎనర్జీ, జినకుశాల్ ఇండస్ట్రీస్.

ఎస్ఎంఈ ఐపీఓలు: ప్రైమ్ కేబుల్ ఇండస్ట్రీస్, సాల్వెక్స్ ఎడిబుల్స్, భారత్‌రోహన్ ఎయిర్‌బోర్న్ ఇన్నోవేషన్స్, ఆప్టస్ ఫార్మా, ట్రూ కలర్స్, మ్యాట్రిక్స్ జియో సొల్యూషన్స్, ఎన్ఎస్‌బీ బీపీఓ సొల్యూషన్స్, ఎకోలైన్ ఎగ్జిమ్, సిస్టమ్యాటిక్ ఇండస్ట్రీస్, జస్టో రియల్‌ఫిన్‌టెక్, రిద్ధి డిస్‌ప్లే ఎక్విప్‌మెంట్స్, గురునానక్ అగ్రికల్చర్ ఇండియా, ప్రరూ టెక్నాలజీస్, టెల్గే ప్రాజెక్ట్స్, చాటర్‌బాక్స్ టెక్నాలజీస్, భావిక్ ఎంటర్‌ప్రైజెస్, డీఎస్ఎం ఫ్రెష్ ఫుడ్స్.

## హెచ్1బీ వీసా రుసుము పెంపుతో ప్రాజెక్ట్ వ్యయాలు పెరగొచ్చు: జీటీఆర్ఐ




దిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్ 1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం భారతదేశం కంటే అమెరికాకే ఎక్కువ నష్టం కలిగిస్తుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) ఆదివారం పేర్కొంది. భారతీయ ఐటీ సంస్థలు ఇప్పటికే అమెరికాలో 5080 శాతం స్థానికులకే ఉద్యోగాలు ఇస్తున్నాయని పేర్కొంది. మొత్తం మీద సుమారు లక్ష మంది అమెరికన్లకు ఉద్యోగావకాశాలు కల్పించాయని తెలిపింది. ప్రస్తుతం అమెరికన్లతో పోలిస్తే, భారత్ నుంచి తీసుకెళ్లిన నిపుణులకు తక్కువ వేతనాలే లభిస్తున్నాయని వివరించింది. తాజాగా పెంచిన రుసుము వల్ల అమెరికాలో స్థానికుల కంటే, భారత్ నుంచి తీసుకెళ్లే వారి కోసం కంపెనీలు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని పేర్కొంది. అందువల్ల కంపెనీలు అమెరికా నుంచి ప్రాజెక్టుల పనిని స్వదేశాలకు తరలించడం పెరగొచ్చని.. దీంతో తక్కువ హెచ్ 1బీ పిటిషన్లు, తక్కువ స్థానిక నియామకాలు జరగొచ్చని అంచనా వేసింది. ఒకవేళ అమెరికా నుంచి ప్రాజెక్టులను తరలించడంపై ఆంక్షలు పెడితే, అక్కడే నియామకాలు జరుపుతాయని.. అయితే యూఎస్ క్లయింట్లకు ప్రాజెక్ట్ ఖర్చులు అధిక మవుతాయ'ని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ వెల్లడించారు.

## రూ.3,200 కోట్లతో 4 బావుల తవ్వకం!



ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా కసరత్తు

అంతర్జాతీయ దిగ్గజం బీపీ సాంకేతిక మద్దతు

దిల్లీ: చమురు, గ్యాస్ నిల్వల కోసం సరికొత్త ప్రాంతాల్లో అన్వేషణ జరిపేందుకు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా వచ్చే ఏడాదిలో రూ.3,200 కోట్లతో స్ట్రాటిగ్రాఫిక్ డ్రిల్లింగ్ చేపట్టాలని యోచిస్తున్నాయి. మొదటి దశలో అండమాన్, మహానది, సౌరాష్ట్ర, బెంగాల్ తీరంలోని లోతైన సముద్ర ప్రాంతాల్లో 4 బావులను తవ్వుతారని తెలుస్తోంది. అనువైన ప్రదేశాలను గుర్తించడం, డ్రిల్లింగ్ చేయడంలో సాంకేతిక నైపుణ్యాన్ని అంతర్జాతీయ బ్రిటిష్ ఇంధన దిగ్గజ సంస్థ బీపీ సాయం చేస్తుంది.

స్ట్రాటిగ్రాఫిక్ డ్రిల్లింగ్ అంటే..

స్ట్రాటిగ్రాఫిక్ డ్రిల్లింగ్‌ను స్ట్రాటిగ్రాఫిక్ టెస్ట్ బావి అని కూడా పిలుస్తారు. ఇది చమురు లేదా వాయువును ఉత్పత్తి చేయడం కంటే భూగర్భ భౌగోళిక నిర్మాణాలను అధ్యయనం చేయడానికి ఉద్దేశించిన ఒక రకమైన అన్వేషణాత్మక డ్రిల్లింగ్. నిరంతర కోరింగ్, పెట్రోఫిజికల్ లాగింగ్, భూకంప డేటా ఇంటిగ్రేషన్ ద్వారా భూగర్భ పొరలపై సమాచారాన్ని సేకరించడానికి ఈ బావులను తవ్వుతారు. వనరులను వెలికితీసే తక్షణ ఉద్దేశం లేకుండా, భవిష్యత్తులో హైడ్రోకార్బన్ అన్వేషణకు మద్దతు ఇవ్వడానికి వివరణాత్మక భౌగోళిక ప్రొఫైల్‌ను నిర్మించడం దీని లక్ష్యం. ఫలానా ప్రాంతంలో వాణిజ్య పరంగా ఉత్పత్తి చేయగల హైడ్రోకార్బన్ వనరులు ఉన్నాయా లేదా అనే దానిపై నిర్ణయం తీసుకోవడానికి ఇది సహాయపడుతుంది.

ఓఎన్‌జీసీ వద్ద రిగ్ ఉందని, 2026 ప్రారంభంలో డ్రిల్లింగ్ ప్రారంభించాలనుకుంటున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఉన్నతాధికారి వెల్లడించారు.

స్ట్రాటిగ్రాఫిక్ డ్రిల్లింగ్‌కు అయ్యే ఖర్చును ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాకు పరిహారంగా చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. రూ.3,200 కోట్ల అంచనా వ్యయంలోనే, బీపీ సంస్థ రుసుము కూడా మిళితమై ఉందని అధికారులు వెల్లడించారు.

## జీఎస్టీ 2.0 ఎఫెక్ట్: చౌకగా లభించే కార్ల జాబితా

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జీఎస్టీ 2.0 రేపటి (సెప్టెంబర్ 22) నుంచి అమల్లోకి వస్తుంది. కొత్త జీఎస్టీ అమల్లోకి వచ్చిన తరువాత చాలా వరకు కార్ల ధరలు గణనీయంగా తగ్గుతాయి. ఇది భారత ఆటో రంగంలోని.. అతిపెద్ద ధరల సవరణలలో ఒకటిగా నిలిచింది. బ్రాండ్ వారీగా ధరల తగ్గింపు వివరాలు ఇక్కడ చూడవచ్చు.

జీఎస్టీ 2.0 కింద చౌకగా లభించే కార్లు - తగ్గిన ధర

మహీంద్రా

బొలెరో నియో: రూ. 1.27 లక్షలు తగ్గుతుంది

ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ: రూ. 1.40 లక్షల తగ్గింపు

థార్ రేంజ్: రూ. 1.35 లక్షల వరకు తక్కువ

థార్ రోక్స్: రూ. 1.33 లక్షల తగ్గింపు

స్కార్పియో క్లాసిక్: రూ. 1.01 లక్షలు తగ్గుతుంది

స్కార్పియో ఎన్: రూ. 1.45 లక్షల తగ్గింపు

ఎక్స్‌యూవీ 700: రూ. 1.43 లక్షలు తక్కువ

టాటా మోటార్స్

టియాగో: రూ. 75,000 తక్కువ

టిగోర్: రూ. 80,000 తగ్గింపు

ఆల్ట్రోజ్: రూ. 1.10 లక్షలు తగ్గింపు

పంచ్: రూ. 85,000 తక్కువ

నెక్సాన్: రూ. 1.55 లక్షలు తక్కువ ధరకు

హారియర్: రూ. 1.40 లక్షలు తగ్గింపు

సఫారీ: రూ. 1.45 లక్షలు తక్కువ ధర

కర్వ్: రూ. 65,000 తగ్గింపు

టయోటా

ఫార్చ్యూనర్: రూ. 3.49 లక్షలు తగ్గింపు

లెజెండర్: రూ. 3.34 లక్షలు తక్కువ

హైలక్స్: రూ. 2.52 లక్షలు తక్కువ

వెల్‌ఫైర్: రూ. 2.78 లక్షల తగ్గింపు

క్యామ్రీ: రూ. 1.01 లక్షలు తక్కువ

ఇన్నోవా క్రిస్టా: రూ. 1.80 లక్షల తగ్గింపు

ఇన్నోవా హైక్రాస్: రూ. 1.15 లక్షల తగ్గింపు

రేంజ్ రోవర్

రేంజ్ రోవర్ 4.4పీ SV LWB: రూ. 30.4 లక్షలు తక్కువ

రేంజ్ రోవర్ 3.0డీ SV LWB: రూ. 27.4 లక్షలు తగ్గింపు

రేంజ్ రోవర్ 3.0పీ ఆటోబయోగ్రఫీ: రూ. 18.3 లక్షలు తగ్గింది

రేంజ్ రోవర్ స్పోర్ట్ 4.4 SV ఎడిషన్ టూ: రూ. 19.7 లక్షల తగ్గింపు

వేలార్ 2.0D/2.0P ఆటోబయోగ్రఫీ: రూ. 6 లక్షలు తక్కువ

ఎవోక్ 2.0D/2.0P ఆటోబయోగ్రఫీ: రూ. 4.6 లక్షల తగ్గింపు

డిఫెండర్ రేంజ్: రూ. 18.6 లక్షల వరకు తగ్గింపు

డిస్కవరీ: రూ. 9.9 లక్షల తగ్గింపు

డిస్కవరీ స్పోర్ట్: రూ. 4.6 లక్షలు తక్కువ

కియా

సోనెట్: రూ. 1.64 లక్షలు తక్కువ

సిరోస్: రూ. 1.86 లక్షల తగ్గింపు

సెల్టోస్: రూ. 75,372 తగ్గింపు

కారెన్స్: రూ. 48,513 తక్కువ

కారెన్స్ క్లావిస్: రూ. 78,674 తగ్గింపు

కార్నివాల్: రూ. 4.48 లక్షల తగ్గింపు

స్కోడా - రూ. 5.8 లక్షల వరకు ప్రయోజనాలు

కోడియాక్: రూ. 3.3 లక్షల తగ్గింపు

కుషాక్: రూ. 66,000 తగ్గింపు

స్లావియా: రూ. 63,000 తగ్గింపు

హ్యుందాయ్

గ్రాండ్ ఐ10 నియోస్: రూ. 73,808 తగ్గింపు

ఆరా: రూ. 78,465 తక్కువ

ఎక్స్‌టర్: రూ. 89,209 తగ్గింపు

ఐ20: రూ. 98,053 తక్కువ

వెన్యూ: రూ. 1.23 లక్షలు తగ్గింపు

వెర్నా: రూ. 60,640 తక్కువ

క్రెటా: రూ. 72,145 తగ్గింపు

అల్కాజార్: రూ. 75,376 తక్కువ

టక్సన్: రూ. 2.4 లక్షలు తగ్గింపు

రెనాల్ట్

కిగర్: రూ. 96,395 తక్కువ

మారుతి సుజుకి

ఆల్టో కే10: రూ. 40,000 తక్కువ

వ్యాగన్‌ఆర్: రూ. 57,000 తగ్గింపు

స్విఫ్ట్: రూ. 58,000 తక్కువ

డిజైర్: రూ. 61,000 తక్కువ

బాలెనో: రూ. 60,000 తగ్గింపు

ఫ్రాంక్స్: రూ. 68,000 తక్కువ

బ్రెజ్జా: రూ. 78,000 తగ్గింపు

ఈకో: రూ. 51,000 తక్కువ

ఎర్టిగా: రూ. 41,000 తగ్గింపు

సెలెరియో: రూ. 50,000 తక్కువ

ఎస్-ప్రెస్సో: రూ. 38,000 తగ్గింపు

ఇగ్నిస్: రూ. 52,000 తక్కువ

జిమ్నీ: రూ. 1.14 లక్షలు తక్కువ

ఎక్స్‌ఎల్6: రూ. 35,000 తగ్గింపు

ఇన్విక్టో: రూ. 2.25 లక్షల తగ్గింపు



# ఈ సినిమాకి ఆ ఇద్దరే స్టార్స్: పవన్ కల్యాణ్



ఇమ్రాన్ హష్మీ, సుజిత్, పవన్ కల్యాణ్, డీవీవీ దానయ్య

"ఒక సినిమా కోసం ఇంతమంది ఎదురు చూస్తున్నారని నాకు తెలియదు. 'ఖుషి' చిత్రం సమయంలో ఈ జోష్ చూశాను. అలాంటి జోష్ మళ్లీ 'ఓజీ'కి వచ్చింది. సినిమాలు వదిలేసి రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా మీరు (ఫ్యాన్స్) నన్ను వదల్లేదనిపిస్తోంది.. మీరు కదా నాకు భవిష్యత్ ఇచ్చింది" అని పవన్ కల్యాణ్ చెప్పారు. సుజిత్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్, ప్రియాంకా మోహన్ జోడీగా నటించిన చిత్రం 'ఓజీ'. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషించారు. డీవీవీ దానయ్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదల కానుంది.

ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఓజీ' ప్రీ రిలీజ్ వేడుకలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ–"సుజిత్ నా అభిమాని. 'జానీ' మూవీ చూసి నాతో సినిమా తీయాలనుకున్నాడు. 'సాహో' సినిమా తర్వాత సుజిత్‌తో సినిమా చేస్తే బాగుంటుందని త్రివిక్రమ్ చెప్పి, నాకు పరిచయం చేశారు. తను కథని ముక్కలు ముక్కలుగా చెప్పినా సినిమా తీసేటప్పుడు తన సత్తా తెలిసింది. ఈ సినిమాకి ఇద్దరే స్టార్స్... నాట్ పవన్ కల్యాణ్. వారిలో మొదటి క్రెడిట్ సుజిత్‌ది. రెండో క్రెడిట్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ది. 'నేను డిప్యూటీ సీఎం అని ఈ రోజు మరచిపోయాను.

మీరు ఊహించుకోండి.. ఒక ఉప ముఖ్యమంత్రి ఇలా కత్తి పట్టుకుని వస్తే ఊరుకుంటారా? సినిమాల్లో కాబట్టి చెల్లిపోయింది. నేను సినిమా ప్రేమికుణ్ణి. సినిమా చేసేటప్పుడు దాని ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. రాజకీయాలు చేసేటప్పుడు అదే ఆలోచనలు తప్ప వేరేవి ఉండవు. సుజిత్ టీమ్ చాలా అద్భుతమైనది. ఇలాంటి టీమ్ నేను దర్శకత్వం వహించే టప్పుడు నాకూ ఉండి ఉంటే రాజకీయాల్లోకి వచ్చేవాణ్ని కాదేమో? ట్రైలర్ పూర్తిగా సిద్ధం కాలేదంటే కుదరదు. మా వాళ్లకి (ఫ్యాన్స్) ఈ రోజు ఎంతో కొంత చూపించాల్సిందే.

నాకు తెలుసు కదా... అమితాబ్ బచ్చన్ గారి కోసం నేను చిన్నప్పుడు ఎలా కొట్టుకునేవాణ్ణో. ఆయన సినిమాకి టిక్కెట్ దొరక్కపోతే చంపేద్దాం అనిపించేది. 'ఓజీ' చిత్రం అందర్నీ రంజింపజేసేలా ఉంటుంది" అని చెప్పారు. ఈ ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు అల్లు అరవింద్, 'దిల్' రాజు, వై. రవిశంకర్, రచయిత కోన వెంకట్, ప్రియాంక మోహన్, సంగీత దర్శకుడు తమన్, నటులు ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్ మాట్లాడారు.

## పీఎంవో నుంచి ఫోన్ వస్తే కల అనుకున్నా!



సినిమా తప్ప నాకు పెద్దగా డ్రీమ్స్ లేవని అంటున్నారు అగ్రహీరో మోహన్‌లాల్. ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని మెప్పించిన ఈయన.. ఇటీవలే ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ పురస్కారానికి ఎంపికైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆదివారం విలేకరుల సమావేశంలో మోహన్‌లాల్ మాట్లాడుతూ.. ''మీరు దాదాసాహెబ్ అవార్డుకు ఎంపికయ్యారంటూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) నుంచి ఫోన్ వస్తే నమ్మలేకపోయాను. కలలో ఉన్నానేమో అనుకొని ఆ విషయాన్ని మరోసారి చెప్పమన్నాను. ఈ పురస్కారం మలయాళ సినిమాకు వచ్చిన అవార్డు. నిజాయతీగా పనిచేయడంతో పాటు భగవంతుడి ఆశీస్సుల వల్లే ఈ పురస్కారం దక్కిందనుకుంటున్నా. ఇది నాకు మాత్రమే సొంతం కాదు.. నన్ను అభిమానించే వారందరికీ ఈ అవార్డు చెందుతుంది. ఎంతో మంది గొప్ప వ్యక్తులు ప్రయాణించిన దారిలోనే నేనూ నడిచా. నేనేం సాధించినా దానికి కారణం వారే. నా సినీ ప్రయాణంలో నేను కలిసి పనిచేసిన కొందరు ఇప్పుడు లేరు. కానీ, ఆ జ్ఞాపకాలెప్పుడూ నాతోనే ఉంటాయి. ఫలానా పాత్రలోనే నటించాలని ఎప్పుడూ అనుకోను. కథ కాంబినేషన్స్‌పైనే ఆసక్తి చూపిస్తా'' అని అన్నారు.

### నా వందో చిత్రం మోహన్‌లాల్‌తోనే!

'ఒప్పం', 'మిన్నారం', 'మిథునం', 'కాలాపానీ' లాంటి ఎన్నో బ్లాక్ బస్టర్ చిత్రాలతో హిట్ కాంబినేషన్ అనిపించుకున్నారు మలయాళ అగ్రకథానాయకుడు మోహన్‌లాల్, దర్శకుడు ప్రియదర్శన్. వైవిధ్యమైన కథల్ని చిత్రసీమకు పరిచయం చేసిన ఈ దర్శకుడు.. తన 100వ చిత్రాన్ని కచ్చితంగా మోహన్‌లాల్‌తోనే చేస్తానని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ''నా సినీప్రయాణంలో మైలురాయి లాంటి వందో చిత్రం గురించి ఎలాంటి ప్రణాళిక లేదు. కానీ నేను కచ్చితంగా ఆ ప్రాజెక్టును మోహన్‌లాల్‌తోనే తీస్తా. ఎందుకంటే ఈరోజు నేను ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం ఆయనే. నన్ను సినిమాలు తీయడంలో ఎప్పుడూ ప్రోత్సహిస్తుంటారు. నా కెరీర్‌కు మద్దతుగా నిలిచారు. చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులుగా పెరిగాం. నా మొదటి సినిమాని కూడా ఆయన హీరోగానే తెరకెక్కించాను. అందుకే ఈ 100వ చిత్రాన్ని ఒక రికార్డు సృష్టించేలా తీర్చిదిద్దుతా'' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ప్రియదర్శన్.. అక్షయ్‌తో కలిసి 'భూత్ బంగ్లా', 'హైవాన్' సినిమాలతో బిజీగా ఉన్నారు.

### ఈ కిరీటానికి మీరు అర్హులు

మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ పురస్కారం వరించిన సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే మోహన్‌లాల్ పోషించిన పాత్రలు భారతీయ చిత్ర పరిశ్రమను సుసంపన్నం చేశాయని, ఈ పురస్కారం మీకు అసలైన గుర్తింపు అని చిరంజీవి కొనియాడారు. ఇండియన్ సినిమా ఐకాన్‌కు తగిన గుర్తింపు ఇదని ఎన్టీఆర్ పేర్కొన్నారు. లాల్ మీ పట్ల సంతోషంగా, గర్వంగా ఉంది.. మీరు నిజంగా ఈ కిరీటానికి అర్హులు అంటూ మమ్ముట్టి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ''మోహన్‌లాల్ మీ ప్రతిభకు, పనికి నేను పెద్ద అభిమానిని'' అన్నారు అమితాబ్ బచ్చన్. వీరితోపాటు పవన్ కల్యాణ్, దుల్కర్ సల్మాన్, రిషబ్ శెట్టి, అక్షయ్ కుమార్ తదితర సినీప్రముఖులు మోహన్‌లాల్‌కు అభినందనలు తెలిపారు.

## 'తమన్నా' గ్లామరస్ సాంగ్ కోసం కోట్లలో ఛార్జ్



తమన్నా భాటియా స్పెషల్ సాంగ్స్ అంటే గ్లామర్, ఎనర్జీ, స్టైల్ అన్నీ కలబోసి ఉంటుంది. ఇప్పటికే ఆమె చేసిన కొన్ని స్పెషల్ సాంగ్స్ థియేటర్లలో ప్రేక్షకులను ఊపేసేలా చేశాయి. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్ ఖాన్ కొడుకు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా తెరకెక్కించిన 'ద బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' సిరీస్‌లో మిల్కీ బ్యూటీ వేసిన స్టెప్పులకు కుర్రకారు ఫిదా అవుతుంది. ఇందులో ఆమె కాస్త గ్లామర్ డోస్ పెంచేశారని కామెంట్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ సాంగ్ కోసం ఆమె భారీ మొత్తంలో రెమ్యునరేషన్ తీసుకున్నారని బాలీవుడ్‌లో టాక్ వినిపిస్తుంది.

ఇటీవల వచ్చిన 'స్త్రీ 2' సినిమాలో 'ఆజ్ కీ రాత్' అంటూ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన తమన్నా (Tamannaah).. ఆ తర్వాత అదే జోష్‌తో 'రైడ్ 2'లో మరో హిట్ సాంగ్‌తో అలరించింది. తాజాగా 'ద బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' వెబ్ సిరీస్‌లో మరింత గ్లామర్‌గా కనిపించి స్టెప్పులేసింది. ఈ సాంగ్ కోసం ఆమె ఏకంగా రూ. 6 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఒక స్పెషల్ సాంగ్ కోసం ఇంత మొత్తంలో రెమ్యునరేషన్ అందుకున్న నటిగా ఆమె రికార్డ్ క్రియేట్ చేసింది.

తమన్నా ప్రస్తుతం ఒక సినిమా కోసం తీసుకుంటున్న రెమ్యునరేషన్ సుమారు రూ.5 కోట్ల వరకు ఉంటుందని ఫిల్మ్ ఇండస్ట్రీలో టాక్ ఉంది. రీసెంట్‌గా ఆమె నటించిన ఓదెల 2 సినిమాకు భారీ రెమ్యునరేషన్ తీసుకున్నట్లు సమాచారం ఉంది. అలాగే, "రైడ్ 2" సినిమాలో "నషా" అనే ఐటమ్ సాంగ్ కోసం ఆమె రూ. 5 కోట్లు వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. జైలర్ సినిమాలో తమన్నా స్పెషల్ సాంగ్ కోసం ఆమెకు రూ. 3 కోట్లు రెమ్యునరేషన్ అందినట్లు కోలీవుడ్ వర్గాల్లో సమాచారం ఉంది. ఇప్పుడు వాటిని బ్రేక్ చేస్తూ కేవలం 3 నిమిషాల సాంగ్ కోసం ఏకంగా రూ. 6 కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నట్లు బాలీవుడ్‌లో వైరల్ అవుతుంది.

## కత్రినాతో తెరను పంచుకోవాలనుంది



సినిమాల్లో కేవలం ప్రేమికురాలిగా మాత్రమే నటించాలని అనుకోవట్లేదు.. హీరోలకు దీటు యాక్షన్ సీక్వెన్స్ చేసే కథల్లో కూడా భాగం అవ్వాలనుకుంటున్నానని అంటోంది బాలీవుడ్ నాయిక వాణీ కపూర్. 'మండలా మర్డర్స్' అనే సిరీస్‌తో ఇటీవలే పోలీసు అధికారిణిగా కనిపించి అలరించిందీమె. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వాణి మాట్లాడుతూ.. "80, 90ల కాలం నాటి మాధురీ దీక్షిత్, శ్రీదేవి లాంటి నటీమణులు ఎన్నో శక్తిమంతమైన పాత్రలు పోషించారు. నేను ఇలాంటి అద్భుతమైన తారల సినిమాలు చూస్తూ పెరిగాను. వారి ప్రయాణాన్నే స్ఫూర్తిదాయకంగా తీసుకున్నా. 'లమ్హే' లాంటి ఎన్నో గొప్ప కథలు మహిళల పాత్రల చుట్టూ తిరిగినవే అనేది నా అభిప్రాయం. నేను కూడా బలమైన భూమికల్నే ఎంచుకోవాలనుకుంటున్నా. పాత్ర ప్రేరేపించేలా ఉంటే చాలు.. నిడివితో నాకు పట్టింపు లేదు. దీంతో పాటు పూర్తి స్థాయి యాక్షన్ సినిమాల్లో నటించాలని అనుకుంటున్నా. ఒక వేళ ఇలాంటి సినిమాలో అవకాశం వస్తే.. కత్రినా కైఫ్‌తో తెరను పంచుకోవాలనే కోరిక ఉంది. ఎందుకంటే ఆమె ఫైట్ సీక్వెన్స్ అదరహో అనిపిస్తుంటుంది. అనుష్క శర్మ కూడా అదరగొడుతుంద"ని చెప్పుకొచ్చింది.

## రెడీ అంటున్న వెంకీ



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో అసలు సిసలు బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్నారు అగ్ర కథానాయకుడు వెంకటేశ్. అసాధారణమైన ఆ విజయం తర్వాత ఆయన ఏ మాత్రం తొందరపడలేదు. అందుకు దీటైన సినిమాని చేయాలనే సంకల్పంతో ఉన్నారు. అందుకే ఆచితూచి కథలపై ఓ నిర్ణయానికి వచ్చారు. తొమ్మిది నెలలుగా కథలపైనే దృష్టిపెట్టి వాటిపై ఓ నిర్ణయానికొచ్చిన వెంకటేశ్... ఇక రంగంలోకి దిగడానికి రెడీ అంటున్నారు. ఆయన ఒప్పుకున్న సినిమాల కోసం త్వరలోనే కెమెరా ముందుకు వెళ్లనున్నారు. చిరంజీవి కథానాయకుడిగా, అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాలో వెంకటేశ్ ఓ కీలక పాత్ర చేయడానికి అంగీకరించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం కోసం అక్టోబరు 20 నుంచి సెట్‌లోకి అడుగు పెట్టనున్నారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకీ ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే లాంచనంగా ప్రారంభమైన ఆ సినిమా చిత్రీకరణ కూడా అక్టోబరు 6 నుంచే ప్రారంభం కానుందని సమాచారం. 'దృశ్యం 3'తోపాటు, బాలకృష్ణతో కలిసి ఓ సినిమాలోనూ నటించనున్నారు వెంకటేశ్. పలువురు యువ దర్శకులు కూడా వెంకీ కోసం కథలు సిద్ధం చేసుకున్నారు. రానున్న రెండు మూడేళ్లలో వెంకటేశ్ వరుస సినిమాలతో సందడి చేయనున్నారు.

## రన్నరప్ సాత్విక్–చిరాగ్ జోడీ




టైటిల్ సాధించాలని ఆశించిన భారత బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి మరోసారి నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో సాత్విక్–చిరాగ్ ద్వయం రన్నరప్‌గా నిలిచింది. 45 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 19–21, 15–21తో ప్రపంచ నంబర్‌వన్ జంట కిమ్ వన్ హో–సియో సెయంగ్ జే (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది.

రన్నరప్‌గా నిలిచిన సాత్విక్–చిరాగ్‌లకు 43,750 (రూ. 38 లక్షల 54 వేలు) డాలర్ల ప్రైజ్‌మనీతోపాటు 9350 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫైనల్లో తొలి గేమ్‌లో 14–7తో ఆధిక్యంలో నిలిచిన భారత జంట దానిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. ఒక్క గేమ్ కూడా కోల్పోకుండా ఫైనల్ చేరిన సాత్విక్–చిరాగ్ తుది పోరులో మాత్రం వరుస గేముల్లో ఓటమి పాలయ్యారు. గతవారం హాంకాంగ్ ఓపెన్ టోర్నీలోనూ రన్నరప్‌గా నిలిచిన సాత్విక్–చిరాగ్... అంతకుముందు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెల్చుకుంది.

సింగిల్స్ విజేత ఆన్ సె యంగ్ ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ ప్రపంచ నంబర్‌వన్, దక్షిణ కొరియా స్టార్ ఆన్ సె యంగ్ మరో టైటిల్ గెలిచింది. చైనా మాస్టర్స్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆన్ సె యంగ్ 21–11, 21–3తో ప్రపంచ మూడో ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై గెలిచింది. ఈ ఏడాది ఆన్ సె యంగ్ ఖాతాలో ఇది ఏడో టైటిల్ కావడం విశేషం

# పాక్‌ను మరోసారి చిత్తు చేసిన భారత్



సూపర్ 4లో టీమ్‌ఇండియా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. మొదట పాకిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. ఫర్హాన్ (58; 45 బంతుల్లో 5×4, 3×6) టాప్ స్కోరర్. శివమ్ దూబె (2/33) బంతితో రాణించాడు. అభిషేక్ శర్మ (74; 39 బంతుల్లో 6×4, 5×6), శుభ్‌మన్ గిల్ (47; 28 బంతుల్లో 8×4) చెలరేగడంతో లక్ష్యాన్ని భారత్ 18.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తిలక్ వర్మ (30 నాటౌట్; 19 బంతుల్లో 2×4, 2×6) రాణించాడు. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో బుధవారం బంగ్లాదేశ్‌తో తలపడుతుంది.

దంచేసిన ఓపెనర్లు: భారత ఫీల్డర్ల పుణ్యమా అని కాస్త మెరుగైన లక్ష్యాన్నే నిర్దేశించిన పాకిస్థాన్.. విజయంపై ఆశలు పెట్టుకునే ఉంటుంది. కానీ ఆ జట్టు నిరుత్సాహం చెందడానికి ఎంతో సమయం పట్టలేదు. భారత ఓపెనింగ్ జంట అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ విధ్వంసక బ్యాటింగ్‌తో పాక్ బౌలింగ్‌ను తుత్తునియలు చేశారు. ఎడాపెడా బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. షహీన్ షా అఫ్రిది బౌలింగ్‌లో ఇన్నింగ్స్ తొలి బంతినే సిక్స్‌గా మలిచి తన ఉద్దేశాన్ని చాటాడు అభిషేక్. ఆ తర్వాత అయూబ్, అఫ్రిది ఓవర్లలో గిల్ రెండేసి ఫోర్లు దంచేశాడు. అబ్రార్ ఓవర్లో అభిషేక్ వరుసగా 4, 6 కొట్టాడు. బ్యాటర్లిద్దరు ఊచకోత కొనసాగించడంతో పవర్‌ప్లే ముగిసే సరికి 69/0తో నిలిచింది భారత్. ఏమాత్రం తగ్గని అభిషేక్.. అబ్రార్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో అలరించాడు. 9.4 ఓవర్లకు భారత్ స్కోరు 105/0.

గెలుపు చాలా తేలికగానే కనిపించింది. వికెట్ పడకుండానే ముగిస్తారేమో అని కూడా అనిపించింది. అయితే విజయం అనుకున్నంత తేలిక కాలేదు. కాస్త శ్రమించాల్సివచ్చింది. ఫహీమ్ బౌలింగ్‌లో గిల్, ఆ వెంటనే రవూఫ్ ఓవర్లో సూర్య (0) వెనుదిరిగారు. జోరు కొనసాగిస్తూ ఇంకో రెండు ఫోర్లు, సిక్స్ బాదిన అభిషేక్ కూడా నిష్క్రమించడంతో భారత్‌కు కళ్లెం పడ్డట్లయింది. 13 ఓవర్లకు స్కోరు 126/3. శాంసన్ (13)తో కలిసి తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. శాంసన్ సాధికారికంగా ఆడలేకపోయాడు. విజయంపై అనుమానాలు లేకపోయినా భారత్‌పై కాస్త ఒత్తిడి పెరిగింది. అయితే ఆ ఒత్తిడిని తిలక్ ఎక్కువ కానివ్వలేదు. 17వ ఓవర్లో జట్టు స్కోరు 148 వద్ద శాంసన్ ఔటైనా.. హార్దిక్ (7 నాటౌట్)తో కలిసి పని పూర్తి చేశాడు. చివరి 9 బంతుల్లో భారత్‌కు 8 పరుగులు అవసరం కాగా.. తిలక్ వర్మ వరుసగా 6, 4 బాదేశాడు.

రాణించిన దుబె: ఈ టోర్నీలో గత మ్యాచ్‌లో భారత్‌పై బ్యాటుతో విఫలమైన పాకిస్థాన్ ఈసారి కాస్త మెరుగైన ప్రదర్శనే చేసింది. భారత ఆటగాళ్ల ఫీల్డింగ్ వైఫల్యం కూడా ఆ జట్టుకు కలిసొచ్చింది. పలు క్యాచ్‌లు వదిలేయడం ద్వారా పాకిస్థాన్‌ను తక్కువ స్కోరుకు పరిమితం చేసే అవకాశాన్ని టీమ్‌ఇండియా చేజార్చుకుంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్‌ను మూడో ఓవర్లోనే హార్దిక్ దెబ్బతీశాడు. ఓపెనర్ జమాన్ (15)ను అతడు ఔట్ చేశాడు. కానీ ఖాతా అయినా తెరవకుండానే జీవనదానం పొందిన ఫర్హాన్ అవకాశాన్ని పూర్తిగా ఉపయోగించుకున్నాడు. చక్కని షాట్లు ఆడిన అతడు.. అయూబ్ (21)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. అయూబ్‌కు కూడా ఓ జీవనదానం పొందాడు. పవర్‌ప్లే ఆఖరుకు పాక్ 55/1తో నిలవగా.. బుమ్రా 3 ఓవర్లలో 34 పరుగులిచ్చాడు. వరుణ్, కుల్‌దీప్, అక్షర్ బౌలింగ్‌లలో ఫర్హాన్ సిక్స్‌లు బాదేశాడు. 10 ఓవర్లలో 91/1తో పాక్ భారీ స్కోరుపై కన్నేసింది. కానీ బంతితో భారత్ పుంజుకుంది. ప్రధాన పేసర్ బుమ్రా నిరాశపరిచిన వేళ.. శివమ్ దూబె అనుకోకుండా హీరో అయ్యాడు. క్రీజులో నిలదొక్కుకున్న బ్యాటర్లనిద్దరినీ ఔట్ చేయడం ద్వారా అతడు పాక్‌ను దెబ్బతీశాడు. 11వ ఓవర్లో అయూబ్‌ను వెనక్కి పంపి 72 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీసిన దూబె.. 15వ ఓవర్లో ఫర్హాన్‌ను ఔట్ చేశాడు. ఈ మధ్యలో తలాత్ (10)ను కుల్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. 11 నుంచి 17 ఓవర్ల మధ్య భారత్ కేవలం 38 పరుగులే ఇవ్వడం గమనార్హం. అయితే ఆఖర్లో పాక్ మళ్లీ బ్యాట్ ఝుళిపించింది. ఫహీమ్ అష్రాఫ్ (20 నాటౌట్), కెప్టెన్ సల్మాన్ అఘా (17 నాటౌట్) మెరవడంతో ఆఖరి మూడు ఓవర్లలో 42 పరుగులు రాబట్టింది. వరుణ్ చక్రవర్తి (0/25) వికెట్లు తీయకపోయినా పొదుపైన బౌలింగ్‌తో పాక్‌ను నియంత్రించగలిగాడు.

పాకిస్థాన్ ఇన్నింగ్స్: ఫర్హాన్ (సి) సూర్యకుమార్ (బి) దూబె 58; ఫకార్ జమాన్ (సి) శాంసన్ (బి) హార్దిక్ 15; సైమ్ అయూబ్ (సి) అభిషేక్ (బి) దూబె 21; తలాత్ (సి) వరుణ్ (బి) కుల్‌దీప్ 10; మహ్మద్ నవాజ్ రనౌట్ 21; సల్మాన్ అఘా నాటౌట్ 17; ఫహీమ్ అష్రాఫ్ 20; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 171; వికెట్ల పతనం: 121, 293, 3110, 4115, 5149; బౌలింగ్: హార్దిక్ 30291; బుమ్రా 40450; వరుణ్ చక్రవర్తి 40250; కుల్‌దీప్ యాదవ్ 40311; అక్షర్ పటేల్ 1080; శివమ్ దూబె 40332

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) రవూఫ్ (బి) అబ్రార్ 74; శుభ్‌మన్ గిల్ (బి) ఫహీమ్ అష్రాఫ్ 47; సూర్యకుమార్ (సి) అబ్రార్ (బి) రవూఫ్ 0; తిలక్ వర్మ నాటౌట్ 30; శాంసన్ (బి) రవూఫ్ 13; హార్దిక్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 3 మొత్తం: (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 174; వికెట్ల పతనం: 1105, 2106, 3123, 4148; బౌలింగ్: షహీన్‌షా అఫ్రిది 3.50400; సైమ్ అయూబ్ 30350; అబ్రార్ అహ్మద్ 40421; హారిస్ రవూఫ్ 40262; ఫహీమ్ అష్రాఫ్ 40311



**ఈసారీ కరచాలనాలు లేవ్**

భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌లో ఈసారి కూడా కరచాలనాలు లేవు. టాస్‌కు వచ్చినప్పుడు భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పాక్ సారథి సల్మాన్ అఘాతో చేయి కలపకుండానే వెనుదిరిగాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కూడా ఇరు జట్ల ప్లేయర్లు కరచాలనం చేసుకోలేదు. లీగ్ మ్యాచ్‌లోనూ పాక్ ఆటగాళ్లతో టీమ్‌ఇండియా ఆటగాళ్లు చేయి కలపకపోవడంతో పెద్ద దుమారం రేగిన సంగతి తెలిసిందే.

**బుమ్రాకు ఏమైంది?**

**ఫార్మాట్ ఏదైనా భారత ఫాస్ట్‌బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడం అంటే ప్రత్యర్థి జట్లకు సవాలే. అయితే ఇటీవల అతడి బౌలింగ్‌లో ఒకప్పటి మెరుపులు కనిపించడం లేదు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో ఓ మోస్తరు ప్రదర్శనతో సరిపెట్టిన బుమ్రా.. ఆసియా కప్‌లో స్థాయికి తగ్గట్లుగా బౌలింగ్ చేయలేకపోతున్నాడు. గ్రూప్ దశలో 2 మ్యాచ్‌లాడి 3 వికెట్లే తీసిన బుమ్రా.. పాక్‌తో సూపర్-4 మ్యాచ్‌లో వికెట్టే తీయలేకపోయాడు. పరుగులివ్వడంలో ఎప్పుడూ పిసినారితనం ప్రదర్శించే బుమ్రా.. 4 ఓవర్లలో ఏకంగా 45 పరుగులు సమర్పించుకున్నాడు. భారత జట్టులో అత్యధిక ఎకానమీ (11.25) అతడిదే. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ (1/29).. బుమ్రాతో పోలిస్తే ఎంతో మెరుగ్గా బంతులేశాడు.**

## పైక్రాఫ్ట్ ఉపాధ్యాయుడేం కాదు: అశ్విన్



దిల్లీ: రిఫరీ పైక్రాఫ్ట్ తన పని తాను చేశాడని.. అతడేం పాఠశాల ఉపాధ్యాయుడు కాదని మాజీ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అన్నాడు. గత ఆదివారం భారత్-పాకిస్థాన్ మ్యాచ్ సందర్భంగా ఆటగాళ్ల కరచాలనం విషయమై వివాదం రేగిన నేపథ్యంలో అతడీ వ్యాఖ్యలు చేశాడు. "ఒక ముఖ్యమైన మ్యాచ్‌లో ఊహించని సంఘటన చోటుచేసుకోకుండా ముందుగానే పైక్రాఫ్ట్ తన పని తాను చేశాడు. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయమని భారత్ ముందుగానే రిఫరీకి వెల్లడించింది. వారి నిర్ణయాన్ని పైక్రాఫ్ట్ ప్రత్యర్థి కెప్టెన్‌కు వెల్లడించాడు. దీనికి పాక్ పెద్ద డ్రామా చేయడం ఎందుకు? పైక్రాఫ్ట్‌కు ఫిర్యాదు చేస్తే అతడు సూర్యను మళ్లీ పిలిచి చేతులు కలపాలని చెబుతాడా? ఈ గొడవలు పరిష్కరించడానికి పైక్రాఫ్ట్ ఉపాధ్యాయుడో ప్రిన్సిపాలో కాదు. అసలు ఈ వివాదంలో అతడి తప్పేంటి?" అని అశ్విన్ ప్రశ్నించాడు.

పైక్రాఫ్ట్ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించాడని పాక్ చేసిన ఆరోపణలను ఐసీసీ పరిగణనలోకి తీసుకోలేదు. అతణ్ని తప్పించాలన్న పాక్ డిమాండ్‌ను పట్టించుకోలేదు. ఆ తర్వాత పైక్రాఫ్ట్, పీసీబీ మేనేజ్‌మెంట్‌కు మధ్య ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఈ సందర్భంగా పైక్రాఫ్ట్ తమ జట్టుకు క్షమాపణ చెప్పాడని పీసీబీ ప్రకటించుకోగా.. దాన్ని ఐసీసీ తప్పుబట్టింది.

# పసికూనపై ప్రతాపం చూపించిన ఇంగ్లండ్.. సిరీస్ కైవసం




ఐర్లాండ్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఇంగ్లండ్ 20 తేడాతో కైవసం చేసుకుంది. ఈ సిరీస్‌లో భాగంగా ఇవాళ (సెప్టెంబర్ 21) జరిగిన మూడో మ్యాచ్‌లో ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 17.1 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.తొలుత ఇంగ్లండ్ బౌలర్లు సత్తా చాటడంతో ఐర్లాండ్ నామమాత్రపు స్కోర్‌కే పరిమితమైంది. ఆదిల్ రషీద్ (40293), జేమీ ఓవర్టన్ (40172), లియామ్ డాసన్ (2092) అద్భుతంగా బౌలింగ్ చేసి ఐర్లాండ్‌ను కట్టడి చేశారు. రెహాన్ అహ్మద్ (30241) కూడా పర్వాలేదనిపించాడు. ఐర్లాండ్ బ్యాటర్లలో ఎవరూ పెద్ద స్కోర్ చేయలేకపోయారు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన గెరాత్ డెలానీ (29 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపుల కారణంగా ఐర్లాండ్ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగింది. రాస్ అదైర్ (33), హ్యారీ టెక్టార్ (28), బెంజమిన్ కాలిట్జ్ (22) రెండంకెల స్కోర్లు చేశారు. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (7), లోర్కాన్ టక్కర్ (1), కర్టిస్ క్యాంపర్ (2), బ్యారీ మెక్‌కార్తీ (0), మాథ్యూ హంఫ్రేస్ (7) నిరాశపరిచారు.అనంతరం 155 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ ఆదిలో కాస్త తటపటాయించినా, ఆతర్వాత తమ సహజ సిద్ధమైన దూకుడు ప్రదర్శించింది. బట్లర్ 0, బేతెల్ 15 పరుగులకే ఔటైనా.. ఫిల్ సాల్ట్ (29), జోర్డన్ కాక్స్ (55) వేగంగా ఆడారు. టామ్ బాంటన్ (37 నాటౌట్), రెహాన్ అహ్మద్ (9 నాటౌట్) ఇంగ్లండ్‌ను విజయతీరాలకు చేర్చారు. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలువగా.. రెండో మ్యాచ్ వర్షం కారణంగా టాస్ కూడా పడకుండానే రద్దైంది.

# అమెరికాదే ఆధిపత్యం

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో అమెరికా మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. టోక్యో ఛాంపియన్‌షిప్‌ను ఆ దేశం అగ్రస్థానం (26 పతకాలు) తో ముగించింది. ఇందులో 16 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు ఉన్నాయి. చివరి రోజు, ఆదివారం 4×100 మీటర్ల రిలేలో అమెరికా 'డబుల్' సాధించింది. 4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలోనూ పసిడి సైతం అమెరికా ఖాతాలోనే చేరింది. మహిళల టీమ్‌లో షెరికా రిచర్డ్‌సన్, మెలిసా జెఫర్సన్, పురుషుల్లో నోవా లైల్స్, కోల్‌మన్ అమెరికా విజయాల్లో కీలకపాత్ర పోషించారు. కెన్యా 11 పతకాలు (7 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలు), కెనడా 5 (3 స్వర్ణాలు, 1 రజతం, 1 కాంస్యం) రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నాయి.




## చరిత్ర సృష్టించిన లిట్టన్ దాస్.. అగ్రస్థానంలో ముస్తాఫిజ్



ఆసియా కప్ 2025లో భాగంగా నిన్న (సెప్టెంబర్ 20) జరిగిన తొలి సూపర్ 4 మ్యాచ్‌లో శ్రీలంక, బంగ్లాదేశ్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించింది. తొలుత శ్రీలంక బ్యాటింగ్ చేసి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేయగా.. బంగ్లాదేశ్ మరో బంతి మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.ఇదిలా ఉంటే, ఈ మ్యాచ్‌లో 16 బంతుల్లో 3 ఫోర్ల సాయంతో 23 పరుగులు చేసిన బంగ్లాదేశ్ కెప్టెన్ లిట్టన్ దాస్ చరిత్ర సృష్టించాడు. బంగ్లాదేశ్ తరపున టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా అవతరించాడు. వెటరన్ ఆల్‌రౌండర్ షకీబ్ అల్ హసన్‌ను వెనక్కు నెట్టి ఈ ఘనత సాధించాడు.షకీబ్ 129 మ్యాచ్‌ల్లో 13 హాఫ్ సెంచరీల సాయంతో 2551 పరుగులు చేయగా.. దాస్ 114 మ్యాచ్‌ల్లో 15 హాఫ్ సెంచరీల సాయంతో 2556 పరుగులు చేశాడు. ఓవరాల్‌గా అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగుల రికార్డు టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (4231) పేరిట ఉంది.

**ముస్తాఫిజుర్ మరో వికెట్ దూరంలో..!**

శ్రీలంకతో మ్యాచ్‌కు ముందు వరకు బంగ్లాదేశ్ తరపున టీ20ల్లో అత్యధిక పరుగులు, వికెట్ల రికార్డులు షకీబ్ అల్ హసన్ పేరిట సోలోగా ఉండేవి. ఈ మ్యాచ్‌లో షకీబ్ పేరిట ఉండిన అత్యధిక పరుగుల రికార్డును లిట్టన్ దాస్ బద్దలు కొట్టగా.. ఇదే మ్యాచ్‌లో షకీబ్ పేరిటే ఉన్న అత్యధిక వికెట్ల రికార్డును ముస్తాఫిజుర్ రెహ్మాన్ సమం చేశాడు.

లంకతో మ్యాచ్‌లో 3 వికెట్లు తీసిన తర్వాత ముస్తాఫిజుర్, షకీబ్ తలో 149 వికెట్లతో సమంగా ఉన్నారు. ముస్తాఫిజుర్ మరో వికెట్ తీస్తే బంగ్లాదేశ్ తరపున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరిస్తాడు.

## స్వియాటెక్ ఖాతాలో 25వ టైటిల్

సియోల్: ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న పోలాండ్ టెన్నిస్ స్టార్ ఇగా స్వియాటెక్ తన ఖాతాలో మరో టైటిల్ జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన కొరియా ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో స్వియాటెక్ విజేతగా నిలిచింది. ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ స్వియాటెక్ 1-6, 7-6 (7/3), 7-5తో రెండో సీడ్ ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై గెలిచింది. స్వియాటెక్ కెరీర్‌లో ఇది 25వ సింగిల్స్ టైటిల్ కాగా... ఈ ఏడాది మూడో టైటిల్. 2 గంటల 41 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో స్వియాటెక్‌కు గట్టిపోటీ ఎదురైంది. కేవలం రెండు ఏస్‌లు సంధించిన స్వియాటెక్ ఏకంగా తొమ్మిది డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదు సార్లు కోల్పోయిన ఈ పోలాండ్ స్టార్ ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 1,64,000 డాలర్ల (రూ. 1 కోటీ 44 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

